విశ్రుతోర్వశీయ నాటకము

కృతికర్త

బ్రహ్మశ్రీ మల్లాది సూర్యనారాయణశాస్త్రిగారు
విశ్రాంతిగొన్న సంస్కృతాంధ్ర భాషోపన్యాసకులు
ఆంధ్రవిశ్వకలాపరిషత్కలాశాల

★

ప్రథమ ముద్రణము

★

ప్రకాశకుడు:
శిరోమణి యరసూరిమల్లికార్జునరావు
రాజమహేంద్రవరము

స్వామ్యములు కృతికర్తవి:

ఇందువచ్చు పాత్రములు

విశ్రుతుఁడు — యాదవరాజు — నాయకుఁడు

శ్రీకంఠుఁడు — తన్మంత్రిపుత్రుఁడు

కిన్నరుఁడు

కణ్వమహర్షి

భార్గవానందుఁడు — ప్రధానమంత్రి

గిరినాథుఁడు

గంగాదాసు

గంధర్వవీరుఁడు

ఊర్వశి — నాయికి

రుచిమతి — చెలికత్తె

కిన్నరి

పతివ్రత — విశ్రుతధర్మపత్ని

మల్లిక — పరిచారిక

ఇందురేఖ — గంధర్వాంగన

వందిమాగధాదులు —

894.8132
SUR-V

10462

పీఠిక

శృంగారప్రధానము వీరాద్భుతకరుణాద్యంగము నవరంగము నైన యీ చిన్నినాటకమునఁ బ్రధాన నాయికానాయకు లూర్వశీవిక్రమ తులు. సూర్యపురాణములోని వీరి పరస్పరానురాగకథ యిందలి ప్రధానేతివృత్తము. ఆధికారికమైన యీవస్తువు దృశ్యకావ్యోచిత మగుటకై ప్రాసంగికవస్తు వొకింత యిందుకల్పితమైనది. దానితోఁ గొన్ని క్రొత్తపాత్రములు నిందుప్రవేశించినవి. అందుచే నిది మిశ్రవృత్తమైనది.

రూపకము వస్తుపాత్రరసపోషణమున సముచితమై ప్రదర్శనరమ్యమయ్యేనేని, యది పూర్వరూపకలక్షణము ననుసరింపకపోయినను హాని లేదన్నభావమును నాయాంధ్రదశరూపక పీఠికలో సూచించియున్నాను. ఇది యట్లు సముచితమో కాదో, అది సహృదయులైన సామాజికులు నిర్ణయింతురు. కాని పూర్వలక్షణము నతిక్రమించి యంకవిష్కంభములకు బదులుగా నే నిందు రంగముల నేర్పఱచియున్నాను.

ఈకావ్యము నిర్మించి యైదుసంవత్సరము లైనది. ఒకమాఱు ప్రదర్శింపఁజేసి ప్రకటింత మని చూచితిని గాని, ఆయత్నము కొనసాగ లేదు. దీనిని విన్న రసజ్ఞులు కొందఱిప్రోత్సాహమునను, మన్మిత్రులు శ్రీ అప్పాద్వేదుల సీతారామయ్యగారి (బి. ఏ. యల్. టి) సముత్సాహ బలమునను నేఁటి కిది ముద్రిత మైనది. నాటకరసజ్ఞులు దీనిని సాదరముగా నవలోకించుటయే నాకృషికి ఫలము.

ధవళేశ్వరము
11—11—49

మల్లాది సూర్యనారాయణశాస్త్రి

శ్రీ చింతామణీముద్రాక్షరశాలయందు ముద్రింపఁబడియె,

రాజమహేంద్రవరం.

శ్రీ రస్తు

ఓనమః పరబ్రహ్మణే

విశ్రుతోర్వశీయము

ఉ. ఎవ్వనికోర్కెనీ తెలివి యెప్పుడులోకము లుప్పతిల్లెనో
యెవ్వనిఁ గాంచఁ గోరెదసుధీంద్రులు మానము నాశ్రయించిరో
యెవ్వఁ డనంతరూపముల నెల్లెడ నిండినయట్లు తోఁచి తా
దవ్వయి చూచునో యతనితత్వము మీకుఁ బ్రసన్న మయ్యెడున్.

మఱియును—

మ. తనుఁ దా నాంతరదృష్టిఁ గన్గొనినయాత్మజ్ఞాని సంసారబం
ధనముక్తిం గని కేవలుం డగుచు నానందించుఁ, దద్యోగసా
ధనసంపత్తికిఁ జిత్తశుద్ధి కుదురు, రద్దానిం బ్రసాదించుఁ బా
వనశీలం, బది యింద నందు సుఖ మాపాదింప వర్ధిల్లుఁడీ!

(నాంద్యంతమున)

సూత్రధారుఁడు— (తెరవంక చూచి) మారిషా! ఒక్కమా టిటు రమ్ము.

మారి— (ప్రవేశించి) బావా! ఎందుకు రమ్మన్నావు?

సూత్ర— నేఁ డభినయించురూపకము శ్రీమల్లాది సూర్యనారాయణ శాస్త్రిప్రణీత మైనవిశ్రుతోర్వశీయ మని మనపాత్రవర్గ మెఱిఁగి యున్నది కదా!

మారి— ఎఱుఁగ కేమి! అందఱు తమతమపాత్రములం దవహితులై సిద్ధముగా నున్నారు.

(తెరలో)

గీ. పుణ్యయమునా నదీ తీరభూములందు
వేడ్క విహరించి కన్నులవిందు గాఁగ
సృష్టివైచిత్రి గాంచి వచ్చెద నటంచు
హితుఁడు తా నేగుచుండె విశ్రుతవిభుండు.

సూత్ర— బళీ! మాటలోనే కథారంభము—మారిషా! వింటివా? విశ్రుతమహారాజు మిత్త్రుఁడైన శ్రీకంఠునితో యమునాతీరవిహారమున కేగుచున్నాఁడఁట. ఇఁక మనపనికి మన మేగుదము.

(ఇరువురు నిష్క్రమింతురు)

ఇది ప్రస్తావన

విశ్రుతోర్వశీయము

—♦ ప్రథమరంగము — యమునాతీరము ♦—

— తెరలో — అశ్వపదధ్వని — పిదప —

గీ. స్వీయ రమణీయ తీర విచిత్రశోభ
గాంచు చేతెంచుచున్నభూకాంతుఁ డతని
హితుఁడు నెక్కినగుఱ్ఱాలగతులు చూచి
యినతనయ నవ్వఁగోఁ జేయుచుండె.

[గుఱ్ఱములు దిగి వారిరువురు ప్రవేశింతురు]

విశ్రు— (సస్మితముగా) శ్రీకంఠా విన్నావా? మనగుఱ్ఱాలగతులు చూచి యమున నవ్వఁగోఁ జేయుచుండె నఁట! సెబాసు! పరిహాసమైనా సరసమై భావరంజకముగా నున్నది.

శ్రీ— ఎవ రని చూచుచున్నాను.

వి— ఇట్టటు చూతు వెందుకు? పైకి చూడు.

శ్రీ— ఔ నిది ఖేచరోక్తియే (అట్లుచేసి) దాఁటిపోయి యుందురు. పోనిండు. మనయశ్వము లలసిపోయిన వని మనమే యనుకొన్నాము గదా!

వి— ఇఁక వీటిని విడువవలసినదే.

శ్రీ— అది నిజమే. ఏటితోఁబాటు దారికూడా మెలికలు తిరిగి యున్నది. పైగా మిక్కిలి యిఱుకు.

వి:— అంతేకాదు. ఎదుట నున్నకొండలవరుస చూడు. ఒకదానిని మించి యొకటి యెత్తు. (తేఱి చూచి) ఆహా ఏమీ మాపర్వత పంక్తి రామణీయకము!

గీ. తరులతాగుల్మకాంతిసంధానకలన
నంతరము లెల్ల నొకటిగా నతుకుకొనఁగ
నేటవాలుగఁ బెరిగినయేకశిఖరి
కరణి విలసిల్లుచుండె నాగిరులసరణి.

శ్రీ:— ఇంక ముందు ప్రయాణము కష్టమే.

వి:— అయితే ఆప్రకృతిసౌందర్యము చూడక పోవడ మేనా?

శ్రీ:— మిాచి త్తము.

వి:— నీవు కూడా అలసిపోయినావా?

శ్రీ:— (చిఱునవ్వు) ప్రభువు ప్రయాసపడు నని ... ...

వి:— ఆసహజశోభాసందర్శనమువలనియానందములో కష్టము కంటెం బకునా? (నిశ్చలదృష్టితో) ఆసౌందర్య దేవత తనమృదుహ స్తము లెత్తి యెట్లాహ్వానించుచున్నదో చూడుము.

శ్రీ:— (ఆలోకించి) మహారాజా! ఏచిత్రకారుండా సౌందర్యము చిత్రింపంగలండు.

వి:— గీ. నవనవోన్మేషచిత్రవిన్యాసములకు
చూపు నివ్వెఱపడి తేటి చూచుచుండ
చి త్తమున శాంతిసుఖమును జేర్చునట్టి
సహజసౌందర్యమాల యీశ్వరునిలీల.

మిత్రమా! మనమిక్కడ నిలచుట కాదు. కొంత ముందు కేగిచూతము. ఈహాయముల నిచ్చట నుండనీ!

(ఇరువురు నడచుచుందురు)

శ్రీ:— మహారాజా! ఎవరో కొండ దిగి వచ్చుచున్నారు. అరుగో!

వి:— (అటుచూచి) ఔను ఎవరో యోగీంద్రుండనుకొందును. అంతే

గీ. బక్కచిక్కిన దేహంబు బ్రహ్మతేజ
మొనయుముఖము జటాభారమున కొంకింత
యొరగుశిర మొప్పునిమ్మహాయోగిదర్శ
నంబు మన కొక్కశుభశకునంబుసుమ్మి!

యోగి:— (యథోక్తముగా ప్రవేశించును)

వి. శ్రీ:— (త్రోవప్రక్క నిలచి వంగి నమస్కరింతురు)

యో:— చిరాయు రస్తు నిరామయో ఽస్తు. (నడచుచుండును)

వి. శ్రీ— (వెంబడింతురు)

యో:— (వెనుదిరిగి యాఁగి) వెనుకకు వచ్చుచున్నా రేమి?

వి—(బద్ధాంజలియై) చిత్తము. తమగమనమున కాటంకము కలుగరాదు. వేఁచేయుచుండుఁడు. పూజ్యపాదుల ననుసరించి వచ్చుచు మనవిచేయుదును.

యో—ఆఁ! ఇంతలో నేమిలే! చెప్పుము.

వి—స్వామీ: యమునాతీరమున నొకింత విహరించుకోర్కెతో బయలుదేఱి వచ్చితిమి. దైవికముగా మహాత్ముల దర్శనమైనది. మా ప్రయాణము ఫలించినది.

యో—ఓ!! అందు కనవచ్చు గుఱ్ఱములు మీవేనా?

వి—చిత్తము స్వామీ!

యో—ఎవరయ్యా మీరు?

వి—నేను యాదవాన్వయుఁడను. విశ్రుతాహ్వయుఁడను. ఇతఁడు మా మంత్రిపుత్త్రుఁడు శ్రీకంఠ నామధేయుఁడు.

యో—(సాకూతముగా నవలోకించి) నీవు జయధ్వజుని పౌత్త్రుఁడవా?

వి—ప్రపౌత్త్రుఁడను. వీతిహోత్త్రుని తనయుఁడను.

యో—(సస్మితముగా) మీ ముత్తాతను నే నెఱుఁగుదును. అతఁడు పరశురామునిబారికి తప్పి వచ్చి యిందు కొంతకాలము తపోనిష్ఠనున్నవాఁడు. అతనివంశ మభివృద్ధిలోనికి వచ్చినది. సంతోషము.

వి. శ్రీ—(సాశ్చర్యానందముగా) పురాణపురుష సందర్శనమున పునీతుల మైతిమి స్వామీ! సహస్రవందనములు.

యో—వంశాభివృద్ధి రస్తు. అయితే కుమారా! ఎక్కడి యదుపురము? ఎక్కడి యమునోత్తర? ఇంతదూరము విహారవినోద మేనా? తీరవిహారము తీర్థయాత్త్రగా పరిణమించినది.

వి—(సహర్షముగా) యమునోత్తరాతీర్థము సమీపించితిమా?

యో—ఇంకెంత? దాదాపు నాలుగుయోజనములు.

వి—ఆహా దైవానుకూల్యము!

యో—సత్యము. సర్వము దైవాయత్తము. కాని, సుమారు రెండామడ గుఱ్ఱమెక్కి వెళ్లుట శక్యము కాదు.

వి—పాదచారినై యేగెద.

శ్రీ—(తెల్లబోయి చూచును)

యో—అట్లే కానీ! (మొగము తేఱిచూచి) దైవ మలంఘ్యము కదా!

వి—మహానుగ్రహము—అయితే స్వామీ! ఇందు వియచ్చరులు విహరించుచుందురా!

యో—విహరింప కేమి? అప్సరోగిరిపై నివసింతురు కూడా.

వి—అ దెక్కడ స్వామీ?

యో—యమునోత్తరాతీర్థమున కుత్తరముగా మఱినాలు గామడలో నప్సర స్తీర్థము. దానిదగ్గఱనే అప్సరోగిరి, శ్వేతాగ్రము. కాని ఆమార్గము దుర్గమముగా నుండును.

వి—మహాత్మా! చాలాసేపు తమయాన మాపినాను. క్షమింపుడు. నమస్కారము.

యో—శుభం భూయాత్ (నిష్క్రమించును)

వి—మిత్రమా! హయరత్నముల నీయడవిని విడుచుట తగదు. అదిగాక మనపరివారము మనకై పరితపించుచుండును. కావున నీ తురగములతో నీవు శిబిరముల కేగి యందలివారితో పురము చేరుము. నే నాతీర్థము సేవించి నెలదినములలో నింటికి వత్తును

శ్రీ—శ్రీవా రసహాయులుగా ......

వి—అదేమి శ్రీకంఠా! (ఒఱపైఁ జేయివేచి) నా కీఖడ్గమే పరమ సహాయ మని యెఱుఁగవా?

శ్రీ—చిత్తము చిత్తము. ప్రభువునాజ్ఞ ......

వి—సరే కానిమ్మా.

(ఇరువురు నిష్క్రమింతురు)

విశ్వామిత్రోర్వశీయము

—♦ ద్వితీయరంగము — యమునోత్తరారామము. ♦—

—♦ తెర తొలఁగించుకొని యొకయువతి ప్రవేశించును ♦—

యు—ఆహా! ఇది యచింతిత సంఘటనమే. ఏక్షణమున కేది యెట్లగునో ముం దెవరి కెఱుక? ఆయోగీంద్రునివంటి త్రికాలజ్ఞు లెందే నుందు రేమో! వారు కాలస్వరూపులే. (స్మరించి) ఊరక చేసిన నా పరిహాసము వియచ్చరవీక్షణమున కుతూహలము కలిగించినది. యోగీంద్రుని సంభాషణము తీర్థసందర్శనమున నుత్సాహము కల్పించినది. అంతటి మహారాజు మహాసుకుమారుఁడు నిపు డేకాకియు పాదచారియు నయ్యెను. (ఊహించి) కొంతదూరము తోడై చేసినతప్పు దిద్దుకొందునా? బుద్ధిశాలి పరేంగితజ్ఞుఁడు, ఇంతమాత్రము కనిపెట్టఁడా? అయినా సరే, అవసరమైన మాటలుమాత్రము వినఁజేయుచు నానారూపములు ప్రచ్ఛన్నముగా ననుసరించి చూచెద. (ముందు చూచి) అదుగో విశ్వామిత్రమహారాజు. మరల తిరిగి త్రోవకు వచ్చెను

—♦ అంత నడచుచున్న విశ్వామిత్రుఁడు ప్రవేశించును ♦—

వి—సాధుదర్శనము సర్వశ్రేయోదాయకము. నా భాగధేయమే యోగీంద్రరూపమున ప్రత్యక్ష మైనది.

యు—ఈ యాత్రికు డింపినది.

వి—గీ. కన విధిప్రేరణము లేక మనుజుఁ డెట్టి
పనియు నూహింప నొనరింప వలఁతి గాఁడు,
పౌరుషంబు ఫలించుట భంగపడుట
దైవమునఁ గాదె? పురుషయత్నం బిఁ కేది?

యు.—సత్యము మహారాజా!

వి.—(తలయెత్తి నల్గడ చూచును)

చ. అనుకొననట్టి యాత్రి యిది హాయిగ నల్దెసఁ జిత్రిపంక్తి దీ
ర్చినగతి నున్న యీప్రకృతిచిత్రము గాంచుచుఁ బుణ్యతీర్థముం
గనియెద, నంతఁ దాపసులఁ గన్గొని మ్రొక్కెద, నంత వెండి పూ
సినయటులుండు నగ్రములఁ జెన్నగునచ్చరకొండఁ గాంచెదన్

యు.—ఆహా! ఏమి చక్కఁదనము? దైవికముగా దివ్యామృతఫలముదృ
గ్గోచర మైనది. అయితే నేమి? చేతి కందవద్దా?

వి.—(ముందు చూచి నడచుచు) అబ్బా! ఇప్పటికి దారి యించుక
సుగమముగా నున్నది.

యు.—(కొంచెము ప్రక్కకు వచ్చి రాజును చూచుచు)

గీ. అంద మంద మటందు రేమందము లవి?
అందమున కందమైన యీయందగాఁడు
వీరశృంగారపూర్ణావతారుఁ డౌర!
ఎంతపుణ్యంబు చేసెనో యితనికాంత?

(తేనెఁ గన్నార మరలఁ గాంచి సాకూతసంశయముగా) ధీరుఁడు వీరుఁడు
తీర్థయాత్రాపరుఁడు. తొందరపడి తేలిక యగుట గాని యీసమయ
మున నీతని హృదయము మెత్తపడునా?

వి.—(ఇట్టటు చూచి సహర్షముగా) ప్రకృతిలక్ష్మి నేత్రపర్వముగా దర్శన
మిచ్చుటే కాదు, కర్ణరసాయనముగా కలస్వనంబున పలుకరించు
చున్నది. (సహర్షముగా) సెబాసు! ఇది నా కుపవనవిహారము
గానే యున్నది—యోగీంద్రా! నమస్కారము.

యు.—ఇతఁ డప్సరోగిరికి రాక మానఁడు. కాని, ఏమిలాభము? ఈ సుంద
రునికి తగినసుందరి యక్కడ సిద్ధము. (చింతించి) కానీ! పదధ్వని
వినఁబడని !

వి:—(ఇట్టటుచూచి) ఎవరును కనఁబడరే! ఎక్కడిదీయడుగులచప్పుడు? (వెనుక తిరిగి) ఏదో చప్పుడా? భ్రాంతి పడితినా? కాదు. కాలి చప్పుడే—కానీ! [నడచును]

యు:—నిశ్శబ్దముగా నడచెద.

వి:— (సహర్షముగా యమునపంక చూచుచు) ఆహా! కుటిలమయ్యు నకృత్రిమ మైనయీకాళిందిగమన మెంత హృదయంగమముగా నున్నది?

యు:— వెనుక నడచెద—

వి:— చ. ఎదు రగు నోరసిల్లుఁ బరుగెత్తుఁ బకాలున నవ్వు దాఁగు వీ
నదరఁగ హోరువెట్టు నదు గంటినయట్లు లఁణంగు లేచుఁ గ
న్నెదరఁగఁ దల్లడిం దగు విచిత్రవిహార కళిందకన్య, మేల్!

యు:—మన పాపఁ జాలకున్నాను. వినఁబడనీ!

చ. మునమలరంగ మిమ్ముఁ గని ముచ్చట దాఁగురుమూఁత లాడెదన్.

వి:— (వెనుతిరిగి) ఎవరు?—నిజమే-ఇది దాఁగురింతయే- (నవ్వుచు) వింతలలో నిది యొకవింత— ... ...

(ఊహించి) ఔనంతే- ఎవరవిమ్మానీవు? మాయశ్వములనడక చూచి నవ్వినదానవా?

యు:— ఇది కోప మనుకోను.

వి:— మాటాడ వేమి? నిజము చెప్పు-సంశయ మేల?-

యు:— (కులుకుగొంతుతో) ఔనండి. కాని, అది దురభిప్రాయము తోడి పరిహాసముకా దని తమకు విదితమే.

వి:—[సస్మితముగా మొగ మాడించుచు] ఇపుడు నానడక చూచి నవ్వ వచ్చినానా?

యు:—(మృదుహాసముతో) కాదు మహీకాంతా! క్షమించండి.

వి:—వియచ్చరీ! నీ తెలివికి మెచ్చుకొన్నాను—సరేకాని, నన్ను పట్టించినా వెందుకు?

యు:—ఏమీ లేదు. మీసుగుణములకు మెచ్చుకొని మిమ్మనుసరించు
చున్నాను.

వి:—(చిఱునవ్వుతో) చక్కఁగా బదులు తీర్చినావు. అయితే, కనఁబడ
రాదా? మాటలాడి వెడలరాదా? ఇదేమిటి?

యు:—నే ననుకొన్నట్లే యున్నది ధోరణి.

వి:—మాటాడ వేమి? యాత్రికుఁడను, న న్నేలను కనుసరింతువు?

యు:—ఆశలు కొంత తీవ్రముగా నున్నదో! లాభము లేదు.

వి:—పోనీ లే! ఇఁక నన్ను వెంటాడకు. (నడచును)

యు:—భూవరా! మన్నింపుఁడు. నిజము తెల్పెదను.

వి:—(ఆఁగి) అదేదో కానిమ్ము, కాలయాపన చేయక ......

యు:—చ. పురుషులయం దపూర్వ మగుపోడిమి చూడ లభించె నేఁటి కీ
శ్వరకృప, నీరుచిర మొగము వాచినయట్టులు కన్నులార నా
దరమునఁ గ్రోలుచుంటి నిది దక్కఁగ, నిఁక మీదురూపుము
దర తగనం చెఱింగియె కనంబడ నైతిని సాంగమన్మథా!

వి:— అయ్యో! వియచ్చరీ! మాయలాఁడి వనుకొని మందలించినాను;
పొరపాటు. నీపొగడ్త కేమిగాని, నీయాత్మజ్ఞత కానందించితిని
మంచిది. ఇఁక నేను పోయివత్తునా? [నడవఁ జొచ్చును]

యు:—మహారాజా!

వి:—[వెనుదిరిగి] ఇంకేమి? నేను దూరము పోవలెను గదా? మాటలతో

యు:—అందుకే నేను మనవి చేయఁబోవుచున్నాను.

వి:—[నవ్వి] బాగున్నది. దానికి నీమనవి యేమి టమ్మా!

యు:—నాభావ మెఱిఁగించితిని గావున నన్నింక శంకింప రనుకొందును

వి:—శంకింపను లే! ఆమనవి కానీ!!

యు:—ముందు మీసౌజన్యమునకు నమస్కారము.

వి—సంతోషము, కృతజ్ఞుఁడను.

యు:—దయతో నాలకింపుఁడు.

మ. గమనాయాసము నోర్వఁజాలునె సుఖాకారంబు మీకాయ? మ
ధ్వము నిమ్నోన్నతశైలసంకులము, తీర్థం బింక మూఁడామ,డు
ల్లమునం దొంటు తలంప కిం డెడమకేల్, గైకొంచు నాకాశమా
ర్గమునం జేర్తు ముహూర్తమాత్రమునఁ దీర్థక్షేత్రముస్ భూవరా!

వి:—సెబాసు బుద్ధిమతీ! నీసద్భావము వెల్లడించితివి, చాలు. నీవు నన్ననాయాసముగాఁ దీర్థరాజముఁ జేర్చినట్లే యానందించితిని. నీకోరిక మన్నించలే దని సంకోచింపకు. నన్నుఁ బోనిమ్ము.

యు:—అయ్యో! ఈసేవచేనైన నాజన్మము ధన్య మగు ననుకొన్నాను.

వి:—ఏమీ! విచార మేల? ఆసౌశీల్యమే ధన్యతకు మూలము. ఇఁక నీ వుండుము.

యు:—పోనిండు మహారాజా! మన మింతసేపు హృదయపూర్వకముగా సంభాషించుటచే మిత్రుల మైతిమి గదా! దానిని బురస్కరించుకొని వేఱొక్కటి మనవి చేయుచున్నాను. ఇది యైనఁ గా దనక యనుగ్రహింతురుగాక.

చ. విమలమనంబునన్ వినుచు విన్నప మంచుఁ దలంచి, యిట్టిదు
ర్గమగిరిరాజి నొంటరిగఁ గాల్నడకం జనరానిమాట డెం
దమున గణించి, మిత్రు డిగనాడినదోషము దిద్దుకొంచు, నె
య్యము పచరించు నీసఖి సహాయముగాఁ బయనం బొనర్పుఁడీ!

వి:—నీయాలోచనము సముచితము. నిజముగా నీ వాప్తమిత్రురాలవు లోకములో నిట్టియవ్యాజమైత్రి దుర్లభము. కాని, నే నేకాకినై చనుటకు నిశ్చయించుకొన్నమాట నీవు వినియే యుందువు. దానికింక తిరుగు లేదు. మన్నింపుము.

యు:—(సగౌరవముగా) కానిం డేమిచేయుదును? సజ్జనసాహచర్యమునకు నోఁచుకోలేదు మీవంటిలోకోత్తరుల ననుసరించిన యామహా

త్రము మఱవఁజాలను. పునర్దర్శన మెపుడో! (చేతులు పట్టుకొని కన్నుల కద్దుకొని) నమస్కారము.

వి:—(సంకోచముతో) అయ్యో!! పోనీలే! నిష్కపటమిత్రురాలవు! నీపే రేమి ?

యు:—ఎందుకు? అదియును ప్రచ్ఛన్నమే. క్షమింపుఁడు,

(తెరలో—గాండ్రుగాండ్రు—

యు:—మహారాజా! పులి పులి—

వి:—ఏది? ఆఁ రానీ! ఓ! ఇది నరమాంసము చవిచూచినదే. నిశ్శంకముగా చేరవచ్చుచున్నది. ఈమార్గమునకు నేఁటితో దీనిపీడ వదలును.

(తెరలో—గాండ్రు గాండ్రు—

వి:—(కత్తి యెత్తి విసరి) గంతు లణఁగినవా?

యు:—మహాశూరా! జయము జయము. (ఇరువురు నిష్క్రమింతురు)

విశ్రుతోర్వశీయము

— తృతీయ రంగము—అప్సరోగిరి మార్గము —

— సముచితవేషముతోడి విశ్రుతుడు నడచుచు ప్రవేశించును —

వి:— ఇదే అప్సరోగిరి—అయితేనేమి? దగ్గఱగా కనవచ్చుచు చేరుచున్న కొలదిని దవ్వగుచున్నట్లున్నది—ఔను. పర్వతస్వభావము బహుచిత్రము.

[తెరలో]

అంతకన్న భూభృత్స్వభావ మనుట సముచితము.

వి: ... ఓ! వియచ్చరనివాసము చెంతకు వచ్చితిని కాబోలు! (పైకిచూచి) ఇది సందర్భోచిత మైనభూనాయకనింద. (ఊహించి) ఆగొంతు కాదు— ఖేచరులు ధన్యులు. కామరూపకామగమనముల సర్వదా సవిలాసముగా విహరించుచుందురు.

[తెరలో]

స్వేచ్ఛావిహారమే ధన్యతకు మూలమా?
కామప్రవృత్తుల కది యట్టిదే.
సవిలాసవిహారమున ఖేచరులకు భూచరులు తీసిపోరు.

వి:—అరే! మరల నీమూడుగొంతులు వేఱు—ఇది నాభలోక్తికి విమర్శనము కాబోలు!— మరల నేమీ వినరాకున్నది. కాని! (నడచుచు) ఇది యొక చిన్నగుహ. (లోనికి చూచి) శూన్యము—ఆఁ! ఇది యొకగొప్పచప్పరము—ఏనాటిదో! నేడు నిర్మించినట్లున్నది—ఇది వీథి. రెండుప్రక్కల పొదరిండ్లు. ఇది వియచ్చరుల విహారస్థలము కాబోలు! (ఏగుచు) ఏ మీధ్వని!— (చూచి) బళీ! శ్రమ సార్థక మైనది. ఎంతగొప్పధార? ఏనుఁగుతొండములా వున్నది. ఆహా!

గీ. ఎన్నియుగములుగాఁ బడుచున్నయదియొ!
ఎన్నియుగములు మఱి పడ నున్నయదియొ!
ఇమ్మహాధారతత్త్వంబు నేర్పరింప
నెవరితర మార! యీశ్వరసృష్టిమహిమ!

(ముందుకు నడచి) ఇది పెద్దగుహ. మిద్దెవలె నున్నది. ఎవరైన సాధువు లుండవచ్చు. (లోనికి తొంగిచూచి) ఒకరెవరో పడుకొని యున్నట్లు కనఁబడుచున్నది. ధ్యానములో నున్నారేమో! పలుకరించిన నపచార మగును.

[గుహలోపలినుండి]— వేణీ!

వి:—సాధువు కాఁడు—ప్రియురాలిని కాఁబోలు పిలుచుచున్నాఁడు. (నడవఁ బోవును]

(లోపలినుండి) ఎవ రది? ఉండు. (అనుమాట వినవచ్చును.)

వి:— (వెనుతిరిగి చూచి) ఈవలికి వచ్చుచున్నాఁడు—కిన్నరుఁడు—

కి:— [ప్రవేశించి] ఎవరు నీవు? లోపలి కెందుకు చూచావు?

వి:— యాత్రికుఁడను. ఎవరైనా యోగులు......

కి:— యాత్రికుఁ డేమిటి? ఇల్లు దూఱడ మేమిటి? [అని గద్దించుచు డాసి] ఎవ రంటే చెప్ప వేమి? మనిషి వేనా?

వి:— [కన్ను లెఱ్ఱచేసి] తొందరపడకు జాగ్రత్తగా మాట్లాడు. కారణము చెప్పినాను. [నడవఁబోవును]

కి:—యోగీ! జోగీ! దొంగవేషం.నరుఁడవేనా యంటే బదులు చెప్ప వేమిఁ?

వి:—ఔను. నరనాథుఁడను.

కి:— ఆఁ! అల్లాగ చెప్పు. స్వయంవరానికి వచ్చినట్లు బాగా వేషం వేసుకొని వచ్చావు లే! ఇక్కడెవరు వరింతు రనుకొన్నావు? ఎవరి కోసం తొంగి చూచావు?

వి:— అట్టే పేలకు, ఒళ్ళు తెలియకుండగా—

కి:—ఏమన్నావు? నా యిల్లు దూఱి పైగా [అని చెయ్యి పట్టుకొనును]

వి:— ఓరి హీనుడా! అని యాచేయిగట్టిగా నలుపుచు] ఏమీ పొగరు? అణగినదా?—బుద్ధి వచ్చినదా? ... ...

కి:— బాబోయి బాబోయి!— అమ్మో చచ్చాను!—అమ్మో! అయ్యో!

[తెరలో]

అయ్యో! ఎవరైనా కొట్టుచున్నారేమో! వట్టిపనికిమాలినవాడమ్మా! ప్రతిదినమూ జట్టీలే కదా! ఎవరో?—అయ్యో! కొట్టకండి వస్తున్నాను.

వి:— ఎవరో పాప మాడది, మొఱ్ఱపెట్టుచు వచ్చుచున్నది.

ఆడది— [ప్రవేశించిచూచి] కనికరించి విడిచిపెట్టండి మహారాజా! చెయ్యి నెత్తురు చిమ్ముచున్నది.

వి:—[విడిచిపెట్టి] నీపేరేమి?—

ఆడ:—నీలవేణి.

వి:—వీడు నీ ప్రియుడా?—మంచివానిచెట్టపట్టినావు! [చిఱునవ్వు] వీడా నీకు దొరకినాడు?

కి:—(చెయ్యి సవరించుకొనుచు కోపముతో] మాటలు బాగా రానీ!

నీ:—చాలులే సిగ్గు లేక యింకా ... ఇంటికి వచ్చినగొప్పవారిని గౌరవించడానికి బదులు దెబ్బలాడుదువా?

కి:—నా చెయ్యి నలిపినందుకు కాళ్లు పట్టి గౌరవించు.

నీ:—నోరు మూసుకో!

వి:—ఛీ! అయోగ్యుడు. [నడవబోవుచు]

నీ:—అటు దయచేస్తున్నా రెక్కడికి?

కి:—దీని కెందుకో? పోనీయక—

వి:—[నడచుచునే] అప్సరోగిరి చూచుటకు.

నీ:—అందుకే అడిగాను. అటు కాదు. ఇటు వేంచేయండి.

వి:—ఏమీ! ఈమార్గము ... ...

నీ:—అది గిరిప్రదక్షిణం చేయడానికి పోయేదారి. దుర్గమము—

వి:—అల్లాగా? ఆదారి?—

నీ:— ఇది తిన్నగా కొండమీందికి పోవును.

కి:— విడిచిపెట్టను కాంబోలురా దేవుఁడా; నా కీచేతిబాధ కూడా వచ్చింది కదా! ... ...

నీ:— ఇటు రండి. [అని ముందు నడచును]

వి:— ఇది సుగమముగా నుండునా?

కి:— [కోపచూపుతో] పోతే పోనీ! లోపలికి పోయి చేతికి తగిగు డ్డయినా చుట్టుకొంటాను [నిష్క్రమించును]

నీ:— ఇది మొన్న బాగుచేసిన కొత్తదారి, మెత్తగా నుండును.

వి:— నీవు చెప్పకపోయిన నే నాదారిని పోయియుందును.

నీ:— పోనీయండి. తమకు శ్రమ తప్పినది. నాకు మాట దక్కినది.

వి:— సరే, ఇక నీ వుండుము. మంచిదానవు—

నీ:— అతఁడు తెలివిమాలినవాఁడు. జరిగినదానికి నేను సిగ్గుపడు చున్నాను. మన్నించి మఱచిపొండు. [దోసిలి యొగ్గును]

వి:— సరిలే! నా కాసంకోచమే లేదు. లోకములో మంచితనముకన్న చెడ్డతనమేయెక్కువ. ఇంతకు నీవినయము వానిని కాపాడు చున్నది. అందుకు సంతోషించుచున్నాను.

నీ:—ఈత్రోవనే తిన్నగా వేంచేయండి. నమస్కారము. [నిష్క్రమించును]

వి:—[నవ్వుకొనుచు] నేఁటిప్రయాణము చిత్రముగానే యున్నది—పుణ్య పాపములకలయిక యైన యీజీవసృష్టిలో భూచరులు ఖేచరులు ననెడి వివక్షకవకాశమే లేదు. ఉత్తమమధ్యమాధమభేద

ముభయసాధారణము. ఇంక విశేష మేమనఁ?—అందఱు నట్టి వారు కారు గాని, వియచ్చరులలో మానవులను నిరసనభావముతో చూచువారెక్కు వనక తప్పదు. తక్కినవిద్య లేవియు లేకపోయినా వియద్గమనవిద్యయే యాదర్పమునకు కారణము—కానీ! ముం దింకేమి యనుభవమునకు వచ్చునో! [నడచుచు] ఓ! ఇది యొకచక్కనివీథి—ఆఁ! ఒకయువతి యిటు వచ్చుచున్నది. [పరికించి] చేతిలోనిది వీణ కాదా?—సందేహ మేమి? రానీ! మంచిశకునమే ... ...

యువతి:—[యథోక్తముగా ప్రవేశించి వచ్చుచు ముందు చూచి] ఎవ రీనూతనపురుషుఁడు— వేషమూ రమణీయము—రూపమూ దర్శనీయము ... ...

వి:—యువతీమణీ! నా క్షేమము క్రొత్త—ఒక్కనిమిషము ... ...

యు:—[ఆఁగి] ఏమి కావలెనండీ? ఎక్కడినుండి వచ్చుచున్నారు?

వి:—నీవు గంధర్వకన్యవా?

యు:—(సస్మితముగా) ఔను.

వి:—నీపే రేమి?

యు:—రుచిమతి—ముందుమీకు కావలసిన దేమో తెలియఁజేయండి...

వి:—స్వకథన మనుచిత మైనను తప్పదు. నేను యాదవరాజ్యపాలకుఁడను. నాపేరు విక్రమతుఁడు. అప్సరోగిరి చూడ వచ్చితిని ...

యు:—(నివ్వెఱపడి చూచి) మీరు క్షత్రియులా? సంతోషము—మహాపురుషులదర్శనము.

వి:—ఔను. అట్లు చూచుచున్నా వేమి?

యు:—ఏమీ లేదు. మీ రతిసుకుమారులు. కష్టపడి కాలినడక నెందుకీదుర్గమభూమికి వచ్చినా రని ... ...

వి:—అది యొకకుతూహలము ... ఇందు చూడఁ దగినవింత లేమని యడుగుటకే ని న్నాపితిని.

యు:—ప్రకృతిశోభావిశేషమే చూడఁదగినది.
వి:—అంతే కదా! నీవు వీణ చక్కఁగా వాయింతువా?
యు:—ఇపుడు నేర్చుకొనుచున్నాను.
వి:—ఎక్కడ? ఎవరివద్ద? ...
యు:—ఇక్కడనే, ఊర్వశిదగ్గఱ ...
వి:—(సాశ్చర్యముగా) ఏమిటీ! ఊర్వశి? ఆయూర్వశియేనా?
యు:—ఔనండీ! ఈపేరు గలసురలోకసుందరి యింకొకతె లేదు. మీరు విన్నయాప్రసిద్ధ గాయనీమణియే.
వి:—(ఉత్కంఠతో) ఆవిద్వాంసురాలిపాటవినుట గొప్పవిశేషము కాదా? ... అదెట్లు?
యు:—సంశయమేమి? రావచ్చు వినవచ్చు. (చిఱునవ్వుతో) అచ్చరల యిండ్లు రాజులయంతఃపురములు కావు.
వి:—(సస్మితముగా) పరిచయము లేదుగదా యని ...
యు:—భూపతుల కట్టిసందేహ ముండునుకాబోలు! నేను పరిచయము కావింతునులెండి— కొండమీఁదికి చూడండి. అదనవచ్చు నదే యూర్వశియిల్లు. ఇదే దారి— సాయాహ్నమున మీరు రచ్చుటికి దయచేయుఁడు. నేనందే యుందును.
వి:—రుచిమతీ! నీసౌశీల్యము ప్రశంసనీయము. సంతోషము.
యు:—మీరు శ్రమపడివచ్చినారు. ఒక్కముహూర్తము విశ్రమింపుఁడుగాక. తగినగృహము చూపెదను. అక్కడ మీకు సర్వము లభించును. దయచేయుఁడు.

[ఇరువురు నిష్క్రమింతురు]

—o—

వి క్ర మో ర్వ శీ య ము

చతుర్థరంగము — ఊర్వశియింటిచావడి

—♦ ఉచితాసనములతో మణిదర్పణాదులతో నలంకృతము ♦—

—♦ ఇట్టటు పచారు చేయుచున్నయూర్వశి ప్రవేశించును ♦—

ఊ:—ఇందురేఖ అందఱివంటిదిగాదు. లేనిమాట పుట్టించదు—ఉన్న మాట దాఁచదు—ఆరాజేంద్రుఁ డీగిరిరాజము చూడ నిశ్చ యించుకొన్నమాట నిజమే. కాని యెందు కింకా రాలేదో! దారి తప్పి కొండచుట్టు తిరుగుచుండె ననుకోరాదు. నీలవేణి మొగలో కాచుకొనియే యున్నది. (సోత్కంఠముగా) దర్పన మైనా కాదా? —ఇందురేఖ యేమన్నది?—

గీ. ఎవరు నిన్ను వరించిన నింతదనుకఁ
దనకు నలకూబరుఁడు దక్క ననుచు మురియు
రంభగర్వ మణంగ నారంభ మగునో !
అమ్మహారాజు మనకొండ కరుగుదెంచు.

తాను నిరాశ చేసుకొనియన్నమాట కాని, యిది ముఖస్తుతి కాదు (దారివంక చూచి) ఆఁ ! రుచిమతి వచ్చుచున్నది. దీని కేమైన జాడలు తెలిసె నేమో ! చూతము.

[వీణ చేపట్టిన రుచిమతి ప్రవేశించును]

ఊ:—(మందస్మితము)రుచీ రావే! ఎన్నాళ్ళకు కంటఁబడ్డావు?

రు:—(వీణ బల్లపై పెట్టుచు సాకూతస్మితముగా) ఎన్నాళ్ళయితే నేమి? సమయాని కందుకొన్నాను.

ఊ:—(నవ్వుచు)నే నేమీ కార్యము తలపెట్టలేదే!సమయ మేమిటి?

రు:—ఇది తలపెట్టె సమయమే.

ఊ:—(సధైర్యగాంభీర్యముగా)అబ్బో! భవిష్యత్తు తెలిసినదా? అయితే కానీ !

రు:—నే నిపుడొకమహారాజును, కాదు కాదు—సౌందర్యరాశిని సందర్శించినాను.

ఊ:—అదృష్టవంతురాలవు—ఎవ రమ్మా!

రు:—ఎవ రేమిటి? నేను బయలుదేఱి వచ్చుచు—అదికా దుండు—

ఊ:—ఆ తడఁబా టేమిటే సరిగా చెప్పక?—

రు:—నీ కెపుడు చెపుదు నన్నయాతు) మట్లు చేయుచున్నది. ముందదే చెప్పెదనులే!—నే నపుడు పూర్తిగా వినలేదు గాని నే నూరికి పోవునాఁడు విన్నమనోహరాకారుఁడే.

ఊ:—(నవ్వి) సెబాసు! నీ వుపాధ్యాయురాలవుగా నుండవలసినదానవు.

రు:—(నవ్వి) ఉండవమ్మా నవ్వకు—అంతా ఒక్కమాటు చెప్పవలెనని యాశ—మాటలు పొసఁగడము లేదు—

ఊ:—త త్తఱపడకు. ఏమి విన్నావు? ఎక్కడ విన్నావు?

రు:—అదంతా పూసగ్రుచ్చినట్లు చెప్పలేను గాని, మణిరేఖప్రశ్నయు నిందు రేఖసమాధానము నొక్కగీతముగా వినిపించెద, విని యూహించుకో !

గీ. అందకత్తెలలోపల నందకత్తె
 వైసనీ విట్టులన, మనలోన నతని
 వలచి వలపించుకొన నింక వలఁతి యెవతె?
 రంభయొక్కతె—ఊర్వశీరమణియొకతె.

ఊ:—అంత చక్కనివాఁడా ?

రు:—నీవు వర్ణింపఁగల వేమోకాని, నాకు వర్ణనాతీతుఁడే.—

ఉ. ఆనరనాథుచక్కఁదన మాపరమేష్ఠితలంపు తీర్చెనో!
తా నయి తీరెనో! యెవఁడు దానిరహస్య మెఱుంగు? దద్గుణ
ధ్యానమొ దానినైజమొ! యథార్థము చెప్పెద నమ్మ మామహీ
జానిని జూచి నేను సుమసాయకుఁడే యనుకొంటి నెచ్చెలీ!

ఊః:—(సహేతుకముగా) ఎక్కడ చూచినావే రుచీ!

రుః:—తినఁబోవుచు రుచి నడుగనేల? ఆవిక్రమమహారాజు నీపాటవిను కోర్కె నిచ్చుటికే వచ్చుచున్నాఁడు. ఇఁక వీణ సవరించుము.
(విక్రమతుఁ డొకవంక ప్రవేశించును)
(ఊర్వశీరుచిమతులు వీణాలక్షణములు సరిచేయుచుందురు)

విః:—(పరిక్రమించుచు) ఊర్వశి యన సాధారణసురకాంత కాదు. ముజ్జగములఁ బ్రశంస కెక్కినది. ఆసుందరి నిందు సందర్శించుట గొప్పవిశేషమే. (ఒక్కడు గాఁగి)

చ. అరయ వియచ్చరాంగనలయందు మనోహరకోమలాంగు ల
ప్సరసలు, వారిలోఁ గుసుమసాయకు నువ్విళులూర్చుచెల్వపుం
గరిమకు రంభ యూర్వశియుఁ గాఁపుర, మందు నిగర్వభావ మ
చ్చెరువగుపాటనేర్పు మృదుశీలము నూర్వశిసొమ్ము గా దొకో!

(నడచుచు) ఆహా విచిత్రసంఘటనము! ఔరా అలభ్యయోగము!
(ఆఁగి) ఔను గాని, ఊర్వశిపాట యని యుబలాటపడితే సరా? అది సురవారసుందరి నెఱజాణ—

గీ. ఆయువతిచక్కఁదనము నేత్రామృతంబు,
ఆవిదుషిపాట కర్ణరసాయనంబు,
ఆసుదతిమాట మానసాహ్లాదనంబు,
నైనయెడ నింక నేను నే నగుదునొక్కొ?

(పరిక్రమించుచు) అయితే యిపుడు కర్తవ్య మేమి? ముందుగా పాట వినుకోరిక చెప్పి పంపితిని గదా! (ఊహించి) ఎందు కీతర్కము!

కానీ! ఇ దెందుకు వచ్చెనో! సర్వము దైవాధీనము (వడిగా నడచుచు) ఇదే యిల్లు, చావడిలో సందడి—

ఊః—(రాగాలాప మారంభించును)

విః—(విని) బళీ! యిది సుధారసబిందువా? కలకంఠీకంఠమా!

ఊః—(దారివంక చూచుచు వాయించుచుండును)

విః—అరే! ఏ మీమార్పు?

రుః—(నవ్వుచు) ఏమీరాగ సరణి? కాదు కాదు. ఏమి రాగమహిమ

ఊః—ఏ మావేళాకోళము? (సరిగా మ్రోగించును)

విః—రాగమాలిక కాదు పరాకు గాని,

ఊః—(స్వరము పలికించుచుండును)

విః—(సమీపించుచు) వహవా! వీణ కాదు, సరస్వతి పలుకుచున్నది.

ఊః—(వాయించుచుండును)

విః—మేలు! రుచిమతి! నీమేలు మెచ్చుకొంటి.

రుః—(ద్వారమువంక చూచి) అదుగో! విక్రమమహారాజు!

(ఇరువురు లేతురు)

విః—(లోనికి వచ్చి చూచి) ఆలావణ్యరాశియే యూర్వశి. ఆహా!

ఊః_రుః—(ఎదురేగి) స్వాగతము స్వాగతము. (ఆతిథ్య మాచరించ రత్నాసనము చూపుదురు)

(అందఱు నుపవసింతురు

విః—(సస్మితముగా) గాయనీమణీ! కథలలో వినుచున్ననీగానమహత్వమును నేడు వీనులవిందుగా విన్నాను, ఈభాగ్యము కలిగించిన దీరుచిమతి.

రుః—(చిఱునవ్వు) మి మ్మిచ్చటికి తెచ్చినదైవమే యిందుకు మూలము.

ఊః:—(సవినయముగా) యాదవేంద్రా ! తమపాదస్పర్శమున నాసదనమును తమదర్శనమున నాజన్మమును పావనములైన వని నే నానందించుచున్నాను.

వి:—సురసుందరీ ! నేను వచ్చినపనికి నేనే యంతరాయము కలిగించితిని. మఱికొంత సేపు నీగానమాధుర్యము కర్ణామృత మగుఁగాక.

ఊః:—(వీణ పలికించుచు రాగ మెత్తుకొనును)

రు:—(శ్రుతి వేయుచుండును)

వి:—(ఆలకించుచు నానందించుచుండును)

కల్యాణి—ఆదితాళము,

కమలనయన । విమలమానసమునన్ ।
దలఁచెదన్ నిన్ । గొలిచెదన్॥ పల్లవి.
పరమపురుషుఁడవు । పరసుఖవరదుఁడ
వపారకరుణాభరితుఁడ వనంగ॥ అనుపల్లవి.
డెంద మురుతరానంద మొంద । నురమందు
పొందువకుసుందరాంగి సిరి । మందహాసి
తములవిందుపసందు । లందుచూపులఁ
గనందగు నను దయ।
వేద మెఱుఁగ ! మతవాద మెఱుఁగ।
జగదాదిదేవ । గతి నీదుపదనతి।

కల్యాణి—ఏకతాళము.

ఆలకింపవా? దేవా ! ఆదరింపవా? పల్లవి.
గానసుధారసపానలోలుఁడవు
వీణాగానమును వీనులవిందుగ। ఆలకిం॥

మనసుజగన్మోహనరూపముపయి
మనిచి సదా నిను మననముచేసెడి
మునిసుత యూర్వశి యొనరుచు
వినుతులు — ఆలకిం......

వి:— హాయి హాయి ! విదుషీమణీ ! (చిఱునవ్వుతో) నీగానరస మా
స్వాదించి హృదయము పరవశ మైనది. ఆనందము పొంగిపొరలు
చున్నది. (లేచును)

ఊ. రు:— (వీణలు ప్రక్కలఁ బెట్టి లేతురు)

వి:— గానమూర్తీ ! ఇది స్తుతి యనుకోకు నిజము చెప్పుచున్నాను.

చ. పురుషులయందు తుంబురునిపోలికఁ గాంతలలో విపంచికా
సురుచిరనిక్వణంబునకు జోడగుకంఠనినాద మొప్పఁ జా
తురి వెలయంగఁ బాడఁ గలతొయ్యలి యూర్వశి యంచు వింటి, శ్రీ
హరికృప నేఁడు వీనులకు హాయిగ గానము వింటి నెచ్చెలీ !

ఊ:— (సవినయస్మితముగా) సంగీతమందలియాదరాభిమానము లిట్లని
పించినవి గాని, యీ పాటిపాట మీరు వినకున్నారా?

వి:— విద్యాచాతుర్యమునకు వినయ మలంకారముగదా!— ఇం కెందుకు?
నాయభిప్రాయము తెలిపెద నాలకింపుము.

మ. తనశక్తిం బ్రకటింప దేవజనవిద్యాదేవి నారాయణుం
డనుమాసీంద్రునియూరుదేశమున దీవ్యత్కాంతిలావణ్యరం
జనరూపంబున నూర్వశీరమణియై జన్మించి సర్వాతిశా
యినియై విశ్వజనీనకీర్తి గనె నంచే నెంచెదఁ భామినీ!

ఊ:— (సిగ్గు నటించుచు) రాజులు పొగడించుకొనుటయే కాని, పొగ
డుట యెఱుంగ రనుకొన్నాను.

వి:— (నవ్వుచు) నిజమే కాని, నా కీపాఠము నీగానమహిమ నేర్పినదే.

(తెరలో)

గీ. రోహిణీచంద్రు లన్యోన్యమోహవశతఁ
గలియుచటి యని తారకల్ గగన వీథి
వెలయఁ జొచ్చెను రుచిమతీ! వేగ వచ్చి
యింట మణిదీపములు తీర్చి యేగవమ్మ.

ఉ:— ఇదిగో వచ్చుచున్నాను (నిష్క్రమించును)

వి:— (సకౌతుకముగా) ఇది చక్కని యుపశ్రుతి

ఉ:— (సాకూతస్మితముగా) మీచిత్తవృత్తి కట్లు తోఁచుట నైజమే.

వి:— సఖీ! నీవు భావజ్ఞురాలవు రసికురాలవు. ఇంకేల? సఖ్యము పచరించి యొక్కటి చెప్పుచున్నాను. సాదరముగా నాలకింపుము.

ఉ:—(కన్నవ విరియ సలజ్జముగా) సవినయాదరముగా నాలించెద.

వి:— మ. కలగంబాఱని కన్యకాత్వము జగత్కల్యాణగాంధర్వ ము
జ్జ్వలసౌందర్యము నిత్యయౌవనము దివ్యంబైనజన్మంబు ని
ర్మలభావంబు మనోజ్ఞభాషణ మసామాన్యానుభావంబు నీ
చెలిమింగూడి సుఖింపఁ గోర్కి గలిగించెన్నాకుఁగాంతామణీ.

ఉ:— (క్రిందు చూచుచు నాలోచన మభినయించును)

వి:— (నిర్వేదపాటుతో) అదేమి చెలీ! భావగర్భితమగు నీపాటయు నీహావభావము లిట్లు ప్రోత్సహించుటచేఁ గాని, విశ్రుతుఁడు మున్నెన్నఁడైన వేశ్యను గోరియుండెనా?

ఉ:— (ఉలికిపడి చూచి) మహీవరా! అన్యథా శంకింపవద్దు. నేను సురవారకాంతను గాని, లోకములోనివెలవెలఁదిని గాను—మీ కోరిక నిరాకరించుదానను గాను—మీరు ప్రభువులు నాయభిప్రాయము తెలిపిన మీ రేమందురో యని యాలోచించుచున్నాను.

వి:— ఇది నెుకజాణతనము గాని, ఎందుకో యేమో యందు ముం దాలోచించుచున్నావా?

ఊ:— (చిఱునవ్వుతో) అట్లయిన చిత్తగింపుఁడు.

చ. సిరిఁ దులఁదూఁగుభూవరులచిత్తము కామమయంబు, క్రొత్తక్రొ
త్తరుచుల వాలుచుండుటయె దానిగుణం, బది గాక యున్న న
ప్సరసలఁ బోలునట్టికులభామిను లుండఁగఁ గంటఁబట్టసుం
దరులకుఁ గోర్కి చేయుదురె? నమ్మఁగవచ్చునె వారికూరిమిన్?

వి:— ఈయభిప్రాయము శ్లాఘ్యమే కాని, రాజు లందఱు నట్టివా యని భావింపరాదు. అయుక్త మైనను నావిషయము చెప్పుకోన వలసివచ్చినది వినుము.

గీ. ఏకపత్నీవ్రతుండ నే నింతదనుక
నిదియె నానూత్నరుచి కెల్ల మొదలు, నమ్ము.
నన్నిటకుఁ దెచ్చి దైవంబు నిన్నుఁ జూపి
నామనసు ముంచె నీదుసౌందర్యలహరి.

ఊ:— (భయవినయముల) మహీరమణా! తెలియ కన్నమాట మనసు నొచ్చిన దేమో! (అంజలి ఘటించి) మన్నింపఁ గోరెదను. నిజముచెప్పుచున్నాను. ఇంతకు మున్నే మీసుగుణసంపద నాహృదయ మాకర్షించినది. కాని, ఒక్కసందేహ మనురాగనిలయ మైనయంతఃపురము విడిచి యీకొండనెత్తిలందు మీ రుండఁగలరా?

వి:— ప్రేయసీ! దీని కింత చింతింపనేల? నాకు నీ వున్నకొంప యంతఃపురంబు, నాకు నీ వున్నకొండ నందనవనంబు. (అని సమీపించి చేయి చాపును)

ఊ:— (నాట్యమున పరిహరించి) మీయవ్యాజానురాగమున కానందించితిని. కాని, యింకొక్కకోరిక —

— (తెల్లఁబోయి) ఇంకేమికోరిక?

:— క. ఏమీం యనుకోరు గదా?

నామాటలు విన్న మీామనం బెటులౌనో?

సామాన్యపుఁగోరిక గా

దేమంగురు?_ చెప్ప మందు రే? నరనాథా!

—చ. తలఁచిననీదుకోర్కె— కవతారికయా యిది? లేక ప్రౌఢకాం,

తలసరసో క్తిచాతురివిధానమ? కాక వినూతనప్రథా

వలయితముగ్ధభాషణవిభావము? యే మనుకొందు? నాతమిం

దెలియఁ బరీక్షసేయఁ దలఁతే? యభిలాషము దెల్పు వేగమే.

ఊ: — (కులుకునవ్వుతో) ఉదారహృదయా! సమయ మడుగఁ గోరి జాగు

చేసితిని క్షమింపుఁడు.

వి:— ఇంకేమి సమయము ప్రేయసీ!

:— నాయనుమతి లేకుండా మీారు నన్ను విడిచిపోరాదు_ ఇదే నే

గోరుసమయము.

—ఔరా! దీనికా యింతయాలోచన? దృఢతర మైనప్రేమబంధము

గాని, యిది యొకసమయమా? నేను కోరవలసినది నీవు కోరినావా

సరే యిచ్చితిని.

—(సానురాగవీక్షణముగా డాయుచు) పరమానందము_(తెరవంక

చూచి) రుచిమతీ!

—(తెర తొలఁగించుకొని వచ్చి దివ్యకుసుమమాలికలు చెరియొక

యిచ్చి వెళ్ళును)

(ఊర్వశీవిప్రమతు లొకరికంఠము నొకరు పుష్పహారమున

నలంకరింతురు).

(తెర లో)

—ం ముహూర్త స్సుముహూర్తో ఽస్తు

చ. జనవిభుఁడైనవిక్రమతునిసంగతి నూర్వశి గాంచు సన్తనం
దనులను యాదవాన్వయము ధాత్రిఁ బ్రసిద్ధికి నెక్కు, నెందు కో
ష్టువికుల మం దనేకపురుషుల్ భువి నేలఁ గ్రమంబుగా జనిం
చినవసుదేవుగర్భమున శ్రీహరి పుట్టునొ ధర్మరక్షకై!

(ఇరువురు సహర్షముగా నంజలి ఘటింతురు)

వి:—ప్రేయసీ! ఈశుభాశీర్వాదము గావించినవా రెవరో! ఆహా! గొ
మాట వింటిని. మాయదువంశమున శ్రీహరి వాసుదేవుఁ
యవతరించు నఁట! ఈదీవనచే మావంశ మంతయు తరించినది

ఊ:—ప్రాణప్రియా! అదిగో చూడండి. ఆవిమానమునఁ బోవుచుఁ
యష్టవసువులే దీవించినవారు.

వి:—ఎంతపుణ్యము? ధన్యుఁడను.

ఊ:—మీసాంగత్యమున నేను ధన్యురాలను.

ఇరువురు:—వసుదేవతలారా! వందనము వందనము.

(యవనికాన్తరితులై నిష్క్రమింతురు)

విశ్రుతోర్వశీయము

పంచమరంగము—యదురాజ సభామందిరము.

—ద్వారము వెలుపల ప్రతీహారి, రాజభటులు, నూతనపురుషుఁడు—

—కులమంత్రి భార్గవానందుఁ డాలోచించుచు ప్రవేశించును—

భా:—(సనిర్వేదహాసముగా) ఈశ్వరేచ్ఛ. జనప్రియుఁడైన పరిపాలకుఁ డనిపించుకొన్న విశ్రుతుఁ డచింతితముగా వనవాసి యైనాఁడా? వానప్రస్థము స్వీకరింపఁ దలఁచిన నేనింకను రాజకార్యపంకమున దిగఁబడి పోవుచున్నానా? ఔరా కర్మఫలము! అటు పట్టమహిషి మనోవ్యథ, ఇటు రాజ్యలక్ష్మి చీకాకు. డెబ్బది దాఁటి జీవించి నందుకీ దుఃఖభారమంతా నాపరమా? (మోమెత్తి) అంతే. దయాశీలుఁ డగువైద్యునిమాడ్కి— ధర్మచింతనుఁ డగుమంత్రి పరదుఃఖితుఁడు కాక తప్పదు—కానీ! ఈశ్వరీకరుణాకటాక్షమెట్లున్నదో!—ఎవ రక్కడ?

ప్రతీ:—(ప్రవేశించి) చిత్తము మహాప్రభూ!

భా:—ఎవరేని చూడవచ్చినవా రున్నారా?

ప్ర:—చిత్తము. ఒక రున్నారు.

భా:—పంపించుము.

ప్ర:—చిత్తము. (వెళ్లును)

క:—(ప్రవేశించి) మహామాత్యా! నమస్కారము.

భా:—రావోయి గిరినాథా! పశ్చిమజనపదవార్త లేమి?

గి:—(సంతోషముతో) ఎన్నని విన్నవింతు మహాత్మా! సకలసస్యఫలసంపన్నమై జనపద మంతా కలకల లాడుచున్నది. మఱియు—

గీ. శ్రీమహారాజ్ఞియాజ్ఞకుఁ జేతు లొగ్గి,
మసలుచున్నారు సకలసామంతవిభులు,
రామరాజ్యంబు మాతల్లిరాజ్య మనుచు,
సంతసించుచు నున్నారు సకలజనులు.

భా:—పరమసంతోషము. తరువాత—

గిరి:—ప్రాగ్దక్షిణవార్తలు విదితములు గదా!

భా:—అందలిసామంతులు విధేయులై కప్పము లంపియున్నారు.

గిరి:—ఇక నుత్తరదేశసామంతులలో చేది దాశ శబర పురరాజులు తప్పఁ దక్కినయందఱు మహారాజ్ఞిశాసనమును శిరసా వహించి వశవర్తులైనా రనుటయే విశేషవార్త.

భా:—ఆత్రిపురాసురులగర్వ మణఁగినచో నిఁక నిశ్చింతయే.

గిరి:—సచివోత్తమా! తమశక్తిత్రయమునుం దాపురత్రయ మాఁగునా? ఇదిగో! కుమారమంత్రిగా రిచ్చినలేఖ.

భా:—(విప్పి చదువుకొని) గిరినాథా! నీ వన్నట్లయినది. (సంతోషముతో నిజాసన మధిష్ఠించి) శాత్రవాగ్ని శాంతించినట్లే.

గిరి:—అందు కనుమానమా ? నేఁడు విజయవార్త వినమా ?

గీ. దురభిమానదురాశలు పెరుగుఁ గాక,
వారు మనసేన నెదిరించి పోరువారె ?
కడుపుమంట మనంబును గలఁచుఁ గాక,
కాలు ద్రవ్వునె గజము సింగంబుఁ గాంచి ?

[తెరలో కలకలము]

భా:—అది గంగాదాసును జూచినయానందమే యనుకొందును.

ప్రతీ:—(ప్రవేశించి) దేవరా! చేదిరాజమంత్రిని చేతులు కట్టి తీసుకొని వచ్చినారు.

—బంధములు విడిపించి తీసికొనిరా.

ప్ర:—చిత్తము_(అట్లు చేసి వెళ్లును)

గం:—ఆర్యవర్యా ! దయాహృదయా ! క్షమింపుఁడు. రక్షింపుఁడు.

గిరి:—ఆఱునెలల క్రిందట నేను దర్శనము చేసినగంగాదాసుగా రేనా?

గం:—(తల వంచుకొనుచు)

భా:—(కిర్కతో లేచి) నేఁడు కృతఘ్నునిమొగము చూచితిని. 'శాంతం పాపం'

గం:—స్వామీ ! దాసుఁడను.

భా:—స్వామి ద్రోహివి. నమ్మినవారిగొంతుకలు కోయుజాతి నీది. నీ పాప మిప్పటికి పండినది. విషజంతువుల వినాశమునకు వాటి విషమే మూలము.

గం:— (చేతులు జోడించి వంగి) దోషినైతే శిక్షాపాత్రుఁడనే ... ...

భా:—ఎందు కీప్రలాపము ? ఆత్రిపురాసురులను గంగలో దింపినవాఁ డెవఁడు ? మాకు శ్రమ గలిగించినవాఁ డెవఁడు ?

గం:—అదంతా నాదోషము కాదు—విచారణ చేయుంపుఁడు.

భా:—రాజద్రోహివి. నీకు పుట్టగతులు లేవు. చేదిరాజును మహారాజును జేసి నీవు మహామంత్రిత్వము వెలిఁగింపవలె ననుకొన్నావా? ఎంత దుశ్చింత ?

గం:—లేదు లేదు మహాత్మా ! పరాధీనుఁడను......

భా:—లోకజ్ఞానశూన్యు లాదాశశబరరాజు లిద్దఱు తో డయినంతనే మీ జేనికి సామ్రాజ్యము వచ్చు నని యూహించితివా ?

గం: (గద్గదస్వరముతో) మన్నించి నామనవి చిత్తగింపుఁడు.

భా:—ఇంక నోరెత్తకు. పట్టమహిషి సామ్రాజ్యము పాలించుట శాస్త్రసమ్మతము కా దంటివా లేదా ?

గం:—మహానుభావా ! అది నామాట కాదు... ...

భా:—పాపము బద్ధమైన దని తెలిసి కూడా కా దనుచున్నావా! ఎంతకైన తగుదువు—జ్ఞాతి యైనా చేదిరాజు వినయశీలుఁడు సామ్రాజ్యభక్తుఁడు. అవినయతనికి పుట్టినబుద్ధి కాదు. నీవు నేర్పినదే.

గం:—శివశివా!

భా:—గంగను స్మరించు. అదే నీకు గతి—ధర్మశాస్త్రనిర్ణయమున నేఁడు నీవు బ్రహ్మర్షి వైనావా? భటు లెవ రక్కడ?

భటు లిరువురు:— (ప్రవేశించి చేయెత్తి మ్రొక్కి) దేవరా! ఆజ్ఞ

భా:— ఈగంగాదాసుని బంధనాగారమునకుఁ గొనిపొండు.

భటు:— చిత్తము మహాప్రభూ! (అట్లు కొనిపోవుదురు)

(తెరలో భేరీనినాదము)

గిరి:— (నవ్వు మొగముతో) అదిగో జయభేరి మ్రోఁగుచున్నది.

భా:— (సానందముగా) మహారాజ్ఞితపస్సు ఫలించినది.

[మరల తెరలో]

గీ. ప్రథితయాదవరాజేంద్ర! జయంబు,
దివ్యకీర్తి! పతివ్రతాదేవి! జయము
నయవిశారద! భార్గవానంద! జయము,
శత్రుమర్దన! శ్రీకంఠ! జయము జయము.

గిరి:— అదిగో! వందిమాగధులస్తుతిగానము—(అటు చూచి) అరు.. శ్రీకంఠమనీషి—

శ్రీ:— (సర్వసేనాధ్యక్షు వేషముతో ప్రవేశించి) తాతపాదులకు వందనము.

—:—కుమారా! చిరాయువు కమ్ము—రాజ్యము నిష్కంటకము గావిం రాజఋణము తీర్చితివి. నాహృదయ మానందమగ్న మైం

;:— అది మహారాజ్ఞితపోమహిమ. తాతపాదులయాశీః ప్రభావము.

భ:— ఆ త్రిపురాసురుల నేమి చేసితివి?

శ్రీ:— (దరస్మితముగా) జీవగ్రాహముగాఁ దెప్పించి మనయారామ మందిరములఁ బ్రవేశ పెట్టించితిని.

:— సాధుసమ్మత మైనపని చేసితివి_అక్క_డ?

శ్రీ:— ఆమూఁడుమండలములు రక్షింప మనముగ్గురు సేనానులను నియమించితిని. అనంతరకర్తవ్యము తమ రాలోచింతురుగాక.

:— సరే. నేను మహారాజ్ఞి కీవృత్తాంతము విన్నవింప నేగెదను. ఇఁక మీపనులు మీరు చూచుకొనండి.

[అందఱు నిష్క్రమింతురు]

—o—

విశ్రుతోర్వశీయము

షష్ఠరంగము—దుర్గప్రాకారములోని దుర్గామందిరము.

పట్టమహిషి పతివ్రత తపస్వినీ వేషముతో మల్లిక వెంటరాఁ బ్రవేశించు

పతివ్రత:— (బద్ధాంజలియై నిలచి)

శ్లో. శ్రీమాతా శ్రీమహారాజ్ఞీ భక్తాభీష్టప్రదాయినీ
రాజరాజేశ్వరీ దేవీ పాతు మాం జగదీశ్వరీ.
[అని పఠించి మానసికారాధన మాచరించుచుండును]

మల్లిక:—(పాడుచుండును)

శ్రీ రాజరాజేశ్వరీ!
సేవింతు నినుఁ గోరి శీతాచలకుమారి! శ్రీరా—
రావమ్మ శర్వాణి! రాజశేఖరురాణి!
నీలాంబుధరవేణి! నీరేజమృదుపాణి! శ్రీరా—
రత్నసింహాసనము రంజిల్లఁ గూర్చొనుము,
అఖిలోపచారమ్ము లర్పింతుఁ గైకొమ్ము, శ్రీరా—
పున్నాగమందారపుష్పాల మనసార,
నర్చింతుఁ బాదంబు లర్పింతు మెడనిండ, శ్రీరా—
కర్పూరదీపాలు కస్తూరిధూపాలు
తేజస్తిమిరమైత్రి తిలకింపు శుభగాత్రి! శ్రీరా—
పండుతాంబూలంబు బంగారుపుష్పంబు
ఆత్మప్రదక్షిణము లంబా! సమర్పణము, శ్రీరా—

పతి:— (దేవీపాదకుంకుము ఫాలమున ధరించి దోసిలి ఘటించి)

చ. పతినెడఁ బాపి నన్నుఁ బలుబాములఁ బెట్టెడుశొంటిపాప మీ
గతిఁ బసినాలుగేండ్లు నిను గట్టిగఁ గొల్చినఁ గూడఁ బోనిచో

బ్రతికినదానఁ గాక మొయి బాసినదానను గాక యెట్టులీ
క్షితిఁ బడి యుండఁజాలుదు? నిసీ! కను లుండియు గ్రుడ్డిదాననై.
తల్లీ! నే నీవిరహాబ్ధి నీదఁ జాలను. ఈయవమానము భరింపఁ
జాలను.

ఉ. పతివిరహార్త యైనపతివత్నికి లోకము జీర్ణకాననం
బతినిబిడాంధకార మని యమ్మ! యెఱుంగవె? యాత్మహత్య దు
ర్గతి కగుఁగాక, యీబ్రతుకుకంటె నదే సుఖమంచుఁ దోఁచె నా
మతి కిపు, డైన నింక నొకమాసము చూచెద నీకృపా ప్తికిన్.

[తెరలో] మల్లికా!

ప:—ఎవ రది ! చూచిరా !

మ:—(వెళ్లి వచ్చి) కణ్వమహర్షిగారు దయచేసినా రఁట !

ప:—(ఆశ్చర్యముతో) ఎంతపుణ్యము ! కులగురువులే ? తల్లి కరుణించి
నది. ఎక్కడ నున్నారో !

మ:—పెద్దమంత్రిగారు వారిని గురుమందిరములో ప్రవేశపెట్టినారఁట !

ప:—అమ్మా ! నమస్కారము—మల్లికా పద ! పద (పరిక్రమింతురు)

మ:—అరుగో మహర్షులు !

[ఉచితాసనాసీనుఁడై కణ్వుఁడు ప్రవేశించును]

ప:—నీ వీద్వారముకడ నుండుము. (లోనికిఁ జని యంజలి గూర్చి)
మహాత్మా గురువరా ! వందనము.

క:—సౌభాగ్యవతీ భవ. (తేఱి చూచి) ఎవ రమ్మాయీ !

ప:—గురువర్యా ! శిష్యురాలు పతివ్రత—

క:—(లేచి) ఏమిటీ ! పట్టపుదేవివా ? ఔరా! ఎంతమార్పు !

గీ. రాజరాజేశ్వరీ దేవిపూజ చేయు
పట్టమహిషికిఁ దోడుగాఁ బరగునట్టి

యగ్ర · లకాంత యైనముత్తైదు వనుచు,

పొరపడితి నమ్మ ! నినుఁ జూచి పుణ్యసాధ్వి !

కుమారీ ! నీ ధర్మాచరణము వనితాలోకమున కుత్తమోదాహరణము.

ప:—(డగ్గుత్తికతో) పూజ్యపాదుల దర్శనమున నాదుఃఖము పొంగివచ్చు చున్నది. (విషాదము)

క: — కుమారీ ! లోకజ్ఞురాలవు. ధైర్యమే శరణము.

ప:—(కన్ను లొత్తుకొని) ఎంత కని మహాత్మా ! ఆసేతుహిమాచల మాఱుసార్లు వెదకించితిని. ఎక్కడా ! (దుఃఖము) నాజీవితే రుఁడు క్షేమముగా నున్నట్లు తమదివ్యదృష్టికి గోచరించెనా

క—:అతఁడు సుఖముగా నున్నాఁడు విచారించకు.

ప:—ధన్యురాలను మహాత్మా ! ఆమాట చాలును. దయచేసి మలంకరింపుఁడు.

క:—(అట్లు చేయును)

ప:—నూతనరాజ్యలక్ష్మిని గూడా స్మరింపక యింతకాల మెందుండెనో హేతు వేమో ! !

క:—ఏమి చెప్పను కుమారీ ?

ప:—(దిగులుతో) అంత చెప్పరానికారణమా స్వామీ ! (గొ... యొగ్గి) నామనస్సు పరిపరివిధములఁ బోవుచున్నది ... ...

క:—అధైర్యపడకు (లేచి) ప్రమాద మేమీ లేదు.

గీ. ఎక్క డుండిన నేమి? యదృష్టశాలి
నిత్యకల్యాణసుఖయోగనిష్ఠ నుండె,
రాజ్య మనుమాట యేమి? సర్వంబు మఱచి
యైహికానందమూ ర్తియై యలరుచుండె.

ప:—(ఆశ్చర్యచకితయై) ఏమి టిది మహాత్మా! నాయార్యపుత్రుఁ డాత్మజ్ఞుఁడు. అంత మఱచెనా? ఎంత వింత!

ఉ. ఆడినమాట తప్ప, రెదు రాడరు పెద్దల, కన్యకాంతలన్
జూడరు కోర్కెమై, శరణువొచ్చినశత్రువు నైనఁ గిన్కఁ బో
నాడరు, ధర్మనిష్ఠ దిగనాడ, రహో సుగుణాలవాల! మే
నాఁకును లేనియామలఅపు నాదురదృష్టము తెచ్చి పెట్టెనే?

:—కాల మొక్కరీతిగాఁ గడచునా? మంచిచెడ్డ యగును. చెడ్డ మంచి యగును. అది లోకమునైజము. ప్రపంచమునం దసంభావ్యమేదియు లేదు. నీ వెఱుఁగని దే మున్నది?

:—ఏమిది మహాత్మా! నామనస్సు కలవరపడుచున్నది. దిక్కు చూపరా?

క:—కుమారీ! నిదానించి వినవలెను గాని తొట్రుపడరాదు

గీ. అప్సరోగిరి చూడంగ నరిగి యచట
నూర్వశిని గాంచి మోహించి యొడలు మఱచె

:—అయ్యో! ఎంతపాపము! ఎంత ఘోరవార్త? కర్ణశూలము మనశ్శల్యము. హాహా! [తల చేతులఁ బట్టుకొనును]

—గీ. దానితోఁ గూడి యుండె నిందనుక, నిపుడె
తెలివి యొక్కింత వచ్చిన తెరువు తోఁచె.

—ఇంకేమి తెలివి? హా దైవమా! నాపరమానురాగభాజన

యాదవరత్నమును వేశ్యమెడ కంటఁగట్టితివా? హా పరమేశ్వరా!
ఇది యావజ్జీవదుఃఖమే. (మూర్ఛిల్లును)

క:—అయ్యో ప్రమాదము! స్త్రీహృదయము దుర్బలము కదా! ఎవరక్కడ?

(తెరలో) చిత్తము చిత్తము.

పల్లిక:— వచ్చి) అయ్యో! - ఎంతకష్టము తల్లీ! (లేవనెత్తి) అమ్మా మనసు నిలపండి (కన్నులొత్తి మెడ నిమురును)

—(నిశ్వసించి చూచి) నీ వెందుకు వచ్చినావు? పో! (లేచును)

చు:—చిత్త మమ్మా! (వెడలును)

క:—అయ్యో కుమారీ ! కడపటిమాటవల్ల కొంచె మైనా దుఃఖము శాంతించు ననుకొన్నాను గాని మితి మీఱు ననుకోలేదు. ఏంతపని జరిగినది ?

ప:—(ధైర్యము నటించి) గురువరా ! మేలే జరిగినది. నాదుఃఖ మొక్క మాఱు తుదముట్ట పొంగి మొదలంట నడుగంటినది. ఇఁక దుఃఖమే లేదు—

క:—ధీరశాంతవు గదా ! మనసు చేపట్టు—

ప:—స్వామీ ! ఇది పరాకుమాట కాదు. మనోనిశ్చయముతో నన్న—

గీ. తనువులే వేఱుగాని చిత్తం బొకండు
గాఁగ నన్యోన్యగాఢానురాగ మలర
నున్నయావేడ్క మరల నా కొదవఁ బోదు
మరులు గొన్నట్టియామది తిరుగఁబోదు.

ఇఁక నిరాశా పరమం సుఖ మ్మనుసూక్తియే శరణము.

క:—అట్లనరాదు. కొలఁదిదినములలో నీకు పతిసందర్శనభాగ్యము పట్టనున్నది.

ప:—మహర్షులమాట యమోఘము. మహారాజదర్శనము మహాభాగ్యము. అయితే ! అనుచితకామవర్తనమున వచ్చినపాతిత్యముమాట యేమి ?

—(సస్మితముగా తలపంకించుచు నాలోచించుచుండును)

ప—[తీవ్రదృష్టితో] ఆహా ! కామ మెంతకైనా తగును.
... నీతి దలంపనీక కులనిందకుఁ జింతిలనీక రాజ్యవి
ఖ్యాతి గణింపనీక సతియం దనురాగము నిల్వనీక యా
కాతలనాఁటిభోగినికి దాసుని జేసితె యాదవేంద్రు ? నా
హా! తలపోయ నెట్లు పురుషార్థముఁ జేసిరొ నిన్నుఁ గామమా ?

క:—[చిఱునవ్వుతో] పతివ్రతా ! సధర్మ మైనకామము పురుషార్థమే.

ప:—[దోసిలి యొగ్గి] భర్తదోషము లెన్నరా దందురు. క్షమింపుఁడు. ఇపుడు యాదవేంద్రునికామ మెట్టి దందురు ?

క:—గృహస్థధర్మవిరుద్ధము గావున దూష్య మనక తప్పదు.

ప:—స్వామీ ! నమస్కారము. ఇఁక నిరాశ గాక మఱేమి ?—దేవీ జగదీశ్వరీ ! ఇఁక నీపాదసేవనమే నాకు ముక్తిసాధనము.

క:—మహారాజ్ఞీ ! చిత్తశాంతి లేనిభక్తి విరక్తులు నిలచునా ?

చ. తెలిసినదాన విట్టిపరిదేవన మెందుకు ? నీకు నీశ్వరీ
బలమున నెల్ల చక్కఁబడు, భర్తృసుఖంబును బుత్రలాభముం
గలుగును, నీసుతుం డవనినాయకుఁడై నుతి కెక్కుఁ గష్టముల్
తొలఁగెను సంపదాళిఁ దులఁదూఁగెద వింకఁ బతివ్రతామణీ !

ప:— (ఆశ్చర్యానందములతో వంగి నమస్కరించి) మునీంద్రా! ఈ యమృతవాణి నాచిత్తశాంతికి మూలము—అయితే ముందుగతి యేమి?—

:— గతి కేమి? దోషమునకు ప్రాయశ్చిత్తము లేదా?

:— (ఉలికిపడి) గురువర్యా! ప్రాయశ్చిత్తమా? అ దెట్లు?

:— భయ మేమి? ఔను. ప్రాయశ్చిత్తము పాపహరణము—అత యొద్దకు పంపుము.

:— అది నాతరమా?

:— ఇం కేల? మహారాజ్ఞివి కదా! నీతి నుపయోగింపుము.

[తెరలో—ఘంటానాదము]

:— కుమారీ! మాధ్యందినకృత్యములవేళ యైనది.

:— చిత్తము మహాత్మా! వందనము.

[ఇరువురు నిష్క్రమింతురు]

విశ్రుతోర్వశీయము

సప్తమరంగము—కొలువుకూటము.

—♦ రత్నసింహాసనమున మహారాజ్ఞీచిత్రపటము ♦ –

[సింహద్వారమున తెర వాలియుండును]

— ♦ కొలువుకూటముప్రక్క మంత్రికచేరీ చావడి ♦—

భార్గవానందుఁడొక్కఁడే యాలోచించుచు కూర్చుండి ప్రవేశించును।

ా:— కష్టములు కాఁపురము చేయ వందురు గాని, నాకష్ట మట్టిది కాదు—పాదుకొని పోయినది (ఎడమచేత కపోలముచేర్చి) ఇఁ కేమి వెదకింపను? ఔరా! ఎంత వింత? (నిశ్వసించి) హా! ఎంఁ పనిచేసితివి విశ్రుతా! ఎందున్నావు నాయనా!!

్రుతుఁడు:— (అదృశ్యరూపమున ప్రవేశించి మంత్రిప్రక్కనున్న యుచితాసన మధిష్ఠించి మంత్రిని చూచి సవిచారము- సత్యమే, ఘోరకృత్యమే–

ా:— రాజ్యము యథాపూర్వముగా స్థిరపడినది, నేను కణ్వాశ్రమ : నకు పోవచ్చు ననుకొంటే, యెప్పటి కప్పుడే, ఆతల్లిదుఃఖము నన్నిల్లు కదలనీయ కున్నది—

:— అయ్యో! (తల వంచుకొనును

ా — ఇఁక నాకర్మ మింతే కాఁబోలు! (అని చేయి వాల్చి, యులికిపడి లేచి, ఏమి టీవింత! శరీరస్పర్శ మైన ట్లున్నది. (వెనుక కడు వేయుచు నెడమప్రక్క చూచి ఎవరును కనఁబడరే! భ్రాం పడ్డానా? అయ్యో!! భ్రాంతి కాదు (ఆశ్చర్యముతో నిట్ట- చూచును

వి:—(లేచి దృశ్యుఁడై బద్ధాంజలియై) ఆర్యా! నమస్కారము.

భా:—[నివ్వెఱపడి] ఎవ రయ్యా! [తేఱి చూచును]

వి:— అయ్యా! నేను విశ్రుతుఁడను.

భా: — విశ్రుతుఁడా? మామహారాజవిశ్రుతుఁడేనా? [ఆపాదమస్తకము చూచును]

వి:—ఆర్యవర్యా! సంశయింపకండి. మీశిష్యుఁడైన విశ్రుతుఁడే—

భా:—కంఠస్వర మదే కాని, రూపము ... నాదృష్టిదోషమా? [సమీపించి] నాయనా! ఖేచరవిద్యలు నేర్చినావా? [కౌఁగిలించి కన్నీరొలుక] మారత్ననిధి మాకు దొరకినదా? బ్రతికియున్నందుకు నిన్నుఁ జూచుభాగ్యము పట్టినది [కన్ను లొత్తుకొనుచు] ఇంత కాలము—

వి:—మీరు పెద్దలు లోకజ్ఞులు వివిధవిద్యాపారంగతులు నాగురువులు, మీ కే మని విన్నవింతును? కర్మఫలము తప్పించుకొనఁ దరమా?

భా:—నిజమే—కాకున్న సాధ్వీమణి యైనమహారాజ్ఞి కంత దుఃఖమా! కాలము సమీపించిన నా కింతభారమా! [కన్నులు తుడుచుకొనును]

వి:—[తల వంచుకొని సవిచారముగా] అయ్యో! ఇఁక నేను దేవిమొగ మెట్లు చూతు నార్యా!

భా:—ఆతల్లియవస్థ చెప్పఁదరమా నాయనా? ముందు కబురు పంపి వత్తు నుండుము—

వి:—ఆకబురు తరువాత—ముం దీచి త్తరువు పంపండి. [అని తనచిత్రపట మిచ్చును]

భా:—[రాజుమొగము చిత్రము పరిశీలించుచు] అయితే, ఇది కాకు రూపము కాదు. ఇప్పటినిజరూపమే. ఔరా! భాగ్యవంతు డెక్క డున్నా భాగ్యవంతుఁడే.

వి:—[చిఱునవ్వు]

భా:—ఏ మీయపూర్వముఖలావణ్యము! [అది కొనిపోయి దేవికి పంపించి వచ్చి] నాయనా! ఇంతకాల మెందున్నట్టు? భరతవర్షమంతా గాలించినాం, ఎక్కడా ....!

వి:—ఏమి చెప్పుదు? దైవము చూపినచోట నుంటిని. ఇంకెందుకా గొడవ?

భా:—ఎందున్నావో గాని, నీముఖకాంతినిబట్టి చూడ నాప్రదేశము లోకోత్తర మని తోఁచుచున్నది. పట్టమహిషికి నీచిత్రము విచిత్రముగా తోఁచును—అబ్బా! ఆదేవిమాట తలఁచుకొంటే కడుపు చెఱువగునుగదా!

వి:—[సవిచారముగా] దైవలీల......

భా:—పదునాలుగేండ్లు శ్రీరాము నడవికి గెంటిన దైవముకూడా యింత ఘోర మైనది కాదు. ఆసతీమతల్లిని సీతను రాముని వెంట నుంచినది. ఈదైవ మీసాధ్విని పతివ్రతాదేవిని—[డగ్గుత్తిక]

వి:—[సాశ్రునయనుఁడై] ఆర్యా! మన్నింపుఁడు. హృదయ ముడికి పోవుచున్నది.

భా:—అయితే, దేవికి ప్రతికూల మైనా యీదైవ మన్నివిధముల నీ కనుకూల మైన దనుట నిజము. ఏమందువా?

చ. తొలుతటినాలుగేండ్లు కథ దుష్కర మయ్యెను నీవు కోటకుం
దొలఁగినసందు గన్నరిపుదుర్మతిచే యమురాజ్యరక్ష, యా
యలజడి యేమిచెప్ప ? జగదంబను గొల్చెడిదేవిసత్తపో
బలమున దక్కెఁగాక కనవచ్చునె యీనవరాజ్య మింతసుఖ ?

వి:—[నిట్టూర్పు పుచ్చి] ఆమహారాజ్ఞిపాతివ్రత్యమహిమకు వందనము. నయకోవిదు లగుమీమంత్రశక్తికి నమస్కారము. ఇరాణిని జూచి యపరాధము మన్నింప వేఁడెదను.

సప్తమరంగము

[తెరలో ఘంటానాదము]

♦సింహద్వారము తెర పైకిలేచును—వందిమాగధు లిరుప్రక్కలనుందురు♦

భా:—సరే ! [రాజుచెయ్యి పట్టుకొని ధర్మాసనము వంక నడుచును]

వి:—ఇ దెందుకు ?

భా:—ముందు సింహాసనము చూచి పిదప—

వి:—[కన్నీరు రొదవ గద్దెవంక చూచి] దేవి సింహాసనముపై నున్న దని చెప్పినారు కా రేమి ?

భా:—మఱచినావో! భ్రాంతిపడినావో ! దృష్టి నిలిపి మరల గద్దెవంక చూడుము.

వి:—(కన్నులు తుడుచుకొని చూచి) ఔరా ! చిత్తరువా ? ఎంత భ్రాంతి ? (సవిచారముగా) ప్రమత్తుడను వంచకుడను—

గీ. రాజ్యలక్ష్మిని మించినరాజ్యలక్ష్మి
పాణిమునకన్న నెక్కుడుప్రాణ మనుచు,
వఱలి మూర్ధాభిషేకోత్సవంబునాటి
దేవిరూపంబు నేనె చిత్రించినాడ.

[ఇరువురు గద్దెచెంతకు వత్తురు]

[తెరలోసాయాహ్నమంగళారావము]

—♦ ద్వారమున వందిమాగధస్తుతి ♦—

వం:—సీ. ఏరాశిధర్మరాజ్యారంభవిధులఁ గృ
తంబుగా మాటె నీద్వాపరంబు ?

మా:— ఏవ్రతశీలపాతివ్రత్యమహిమ కా
బాలగోపాలంబు కేలు మోడ్చు ?

వం:— ఏపట్టమహిషియాజ్ఞాపాత్ర మఖిలసా
మంతవర్గము దాల్చు మస్తకమున ?

మా:— ఏవిక్రమతార్ధాంగియావిభావిక్రమతం
బై యర్థిసంతృప్తి నాచరించు ?

వం:— గీ. ఆమహారాజ్ఞి పుణ్యసాధ్వీమతల్లి
మా:— భవ్యయాదవసామ్రాజ్యభాగ్యలక్ష్మి
వం:— ధీరశాంత పతివ్రతాదేవికీర్తి
మా:— పండువెన్నెలమాడ్కి విశ్వంబునిండె.
వి:— (ఆనందపరవశుండై రాణిపాదము లంటును)
వం:— గీ. అఖిలరంజనపరిపాలనా! జయంబు
మా:— సకలసామంతవందితాజ్ఞా! జయంబు
వి:— నన్నుఁ జూచి సామంతరాజనుకొన్నాఁడా యేమి?
భా:— నిన్నుఁ జూడలేదు. అట్లనుకోలేదు. ఇది నిత్యస్తవమే.
వం: గీ. రత్నసింహాసనాధికారప్రభావ
దీపనీ! పతిభక్తిమూర్తీ! జయంబు.
వి:— (చేతులు జోడించి) దేవి! నీవిఖ్యాతి వీనులవిందైనది.
భా:— ఇఁక నంతఃపురమున రాణిని దర్శింపుము—నే నుందును. (యవనికాంతరితుఁడై వెళ్ళును)
[అంత రాజుచిత్తరువు చూచుచు విచారించుచున్నపతివ్రత తపస్విని వేషముతో నొకవంక ప్రవేశించును]
వి:— (పరిక్రమించుచు) అకటా! కాళ్ళు తడఁబడుచున్నవి—హా దేవి! ...
ప:— అయ్యో! ఎంతటిభాగ్యహీనురాలను?— ఆవయ స్సట్టే నిలచినది! ఆలావణ్యము రెట్టింపైనది? ఎంతచిత్రము? ఏమిమహాత్మ్యము? ఔరా! నన్ను చూచి యేమనుకొందురో! యేమందురో!!
వి:— ప్రేయసీ! గుండె దడదడ లాడుచున్నది. ఎట్లు చూతునో! ...
ప:— హా! ఆర్యపుత్రా! మీరు సౌందర్యకాములు. మీతపస్సు ఫలించినది. (సవిషాదముగా) ఆనాఁటిరూపమే నచ్చలేదుగదా! ఈనాఁటినారూపము మీకు నచ్చునా? అయ్యో!!
వి:— సతీమణీ! రూపమోహమున పాప మొనరించితిని. ఈ ద్రోహి నెట్లాదరింతువో! నీముఖ మెట్లు చూతునో! హా! హా!

ప:—(నిశ్వసించి) హా ! ఆర్యపుత్రా ! మి మ్మెట్లు చూతునో ! లజ్జా శోకావమానములు మనస్సును కలంచివేయుచున్నవి— గురువరా ! ఏమందునో, ఏమి పాపము తెచ్చుకొందునో !—నీవే దీవనయే నాకు దిక్కు.

గీ. ఎట్లు లోర్చితినో దుఃఖ మింతకాల,
మింతబాధ యెఱుంగ ని దేమివింత ?
నోము పండెను విభుని గన్గొందు ననఁగ,
భగ్న మనుచుండె హృదయంబు పట్టఁజాల.

వి:—[అంతిపురమున నడుగు పెట్టును]

మల్లిక:—[తెల్లఁబోయి చూచి] దేవా! ఇట్టిటు... ... ...

వి:—[కలయఁజూచి] ఇది శ్రీనివాస మేనా? అయ్యో! ఆశోభ యేది?

ప:—తల్లీ! ఈశ్వరీ! నానోట నెట్లు పలికింతునో! [విషాదము]

వి:—గీ. దేవిచందంబు ముందుగాఁ దెలిసికొనఁగ,
రాణివాసంబు నాకుఁ బ్రమాణ మయ్యె,
అమ్మహాదేవిపాదంబు లంటి మ్రొక్క—
నర్హతయు లేనిపతితుండ నైతి నేను.

మ:—అదే రత్నపీఠము విచ్చేయుఁడు [చూపి వెళ్లును]

వి:—[తల వంచుకొని దోసిలి యొగ్గి] దేవీ! దోషిని క్షమింపుము [విషాదము]

ప:—[పాదము లంటి మ్రొక్కి] ఆర్యపుత్రా! హా! హా! [దుఃఖము]

వి:—రక్షించు రక్షించు. [కాళ్ళపైఁ బడును]

ప:—[ఏడ్పుగొంతుతో] అయ్యో! నా కీపాపముకూడా... ...[లేవనెత్తును]

వి:—దేవీ! నో రాడ కున్నది. [విచారము]

ప:—[దుఃఖముతో] నాథా! నా కీజన్మలో దర్శనమే లభింప దనుకొన్నాను [చేతులు పట్టుకొని] కంటఁ బడ్డారు. ఇదే పదివేలు. (కన్నీరు)

వి:—దేవీ! వద్దు వద్దు. నీవు దుఃఖించిన నాగుండె పగిలిపోవును [తన కన్ను లొత్తుకొని యామె కన్ను లొత్తి భుజమునఁ జేయి వైచి తేఱిచూచి గద్గదస్వరముతో] అయ్యో! దేవీ! [కన్నులు మూసికొని వెనుక కడుగు వేసి] ఈ వేష మేమి ప్రేయసీ! [విచారము]

ప:—(సవిచారముగా) భర్త ప్రవాసము నందున్నపుడు భార్యను విహితమైనవేష మిదేకదా!

వి:—ఔరా! ఎట్టిరూప మెట్లయినది? (ప్రక్కకు చూచుచు) అయ్యో!

సీ. చలినీట నిత్యంబు స్నాన మాడుదు వంచు
చాయ మాసినశిరోజములు దెల్పు,
పైడిచీరలు పచ్చపట్టుచీరలు దరిఁ
జేర నీవని కావిచీర దెల్పు,
తారహారాద్యలంకారధారణము కో
ర వటంచుఁ బసుపుసూత్రములు దెల్పు,
కస్తూరితిలకంబు గైసేయ వని పూజఁ
బెట్టిన కుంకుముబొట్టు దెల్పు,
గీ. పతిప్రవాసంబు పేర నీపట్టినట్టి
వ్రతము నీమేనిసొంపు తార్మాఱుచేసి;
కటకటా! పాపినైన నాకన్ను పొడిచి
చెట్టనగు నామనంబునఁ జిచ్చు వెట్టె.

దేవీ! క్రూరాత్ముఁడను. వంచకుఁడను. నీమొగము చూడఁజాలకున్నాను. (విషాదము)

ప:—(దుఃఖముతో) అది నాపాపము గాని మీదోషము కాదు. ధీర హృదయులు విచారింతురా ?

వి:—[మీఁదు చూచుచు] ఘోరము—ఘోరాతిఘోరము !

గీ. దుర్గమాద్రికి నన్నట్లు త్రోసినావు
దేవి నిట్లు తపస్యకు దింపినావు
శ్రీనివాసంబుసొంపు హరించినావు
దైవమా ! నీమహత్త్వంబు దారుణంబు.

(క్రిందు చూచుచు) సాధ్వీమణీ ! నిన్ను చూడలేకున్నాను.

ప:—[డగ్గుత్తికగా] పదునాలుగేళ్ళనుండి మహారాజా !

వి:—ప్రాణేశ్వరీ ! చంపకు. అది గాదు, ఈవేషము చూడలేకున్నాను.

ప:—[గద్గదస్వరముతో] ఔను. వేశ్యావేషమువలె నిల్లాలివేష మింప గునా ?

వి: [కన్నులు మూసికొని చేతులు జోడించి] జీవితేశ్వరీ ! నాపరమ రహస్యము కనిపెట్టిననీపాతివ్రత్యమహిమకు నమస్కారము— కాని యిది మునుపటియిల్లాలివేషము కాదు.

ప:—అయ్యో ! నే నేమిచేయుదును ? ఇది మీ రిచ్చినవేషమే కాని నేను కోరుకొని తెచ్చుకొన్నది కాదు.

వి:—క్షమించు దేవీ ! క్షమించు—నీధర్మాచరణము జగదేకవంద్యము— నీచెంత చేరితిని గదా! ఇక నెందుకు? ఇది మార్చి వెనుకటి రూపముతో దర్శన మిమ్ము ధన్యుఁడ నయ్యెద.

ప:— (సవిషాదముగా) ప్రాణనాథా! అది భ్రాంతి గాని మార్చితే మాత్ర మింతలోనే రంభ నగుదునా? ఊర్వశి నగుదునా? ఆయపూర్వలావణ్యమున కీరూపము నచ్చునా?

వి:— హాహా! నాగుట్టంతా బట్టబయ లైనది— దేవీ! క్షమించు. ప్రాణేశ్వరీ! రక్షించు!

ప:—(విషాదముతో, ఎక్కడిప్రాణేశ్వరి? అనురాగస్థానము సౌశీల్యమో సౌందర్యమో, ఆర్యపుత్రునిహృదయమే యెఱుఁగును.

వి:— హా సతీ! చచ్చితిని. అజ్ఞానిని (విషాదము) నీ వేఁపుచు నన్నే డ్పించుచున్నావు.

ప:—(దుఃఖముతో) సత్యము_తెగించి దేహము విడునక నీ కిట్టియుపచార మొనరించితిని. క్షమించండి_

వి:— ఛీ విశ్రుతా! నీ కీకత్తిపోటు చాలదా? (నిశ్వసించి) దేవీ!

ఆ. సగము చచ్చి వచ్చి శరణన్నవాఁడను
కనికరించి నన్నుఁ గావఁ దగును.

(క్రిందు చూచుచు నంజలి ఘటించి యుండును)

ప:: —(దుఃఖము పొంగి పొరల)

ఆ. అప్సరోఽద్రిమీఁద నర్ధాంగ ముంకుట
కతన నీసగంబు గాసిఁ జెందె.

(అని విలపించుచు)

వి:—ప్రాణేశ్వరీ ! దాసుఁడను శరణార్థిని, అపరాధిని (కాళ్ళు పట్టుకొని) యాదవసామ్రాజ్యధురీణవు. తగినశిక్ష విధించి యీపాపి పునీతుని గావింపుము.

ప:—(లేవనెత్తి) ఆర్యపుత్రా ! నాకు పరముకూడా లేకుండఁ జేయుదురా ? నిజము పలికియు భర్తమనసు నొప్పింపరా దని యెఱుగుదును. దుఃఖావేశమున నే మంటినో ! నాథా ! నమస్కారము క్షమింపుఁడు. (పాదము లంటి మ్రొక్కును)

వి:—ప్రేయసీ ! నీమనసు నొప్పించినవాఁడను నేను. తప్పునాది

ప:—అది కాలదోషము గాని మీదోషము కాదు. దాని ప్రభావ మహిమత్వము విచిత్రము_

వి:—ఇది కులదేవతవాక్కు. దేవీ ! సత్యము సత్యము.

ప:—కర్మవశమున మీకామము గృహస్థవిధుల నతిక్రమించినది. ధర్మరహితమైనకామము నరకహేతు వందురు. (విచారముతో) ఏమి చేయఁదగునో తోఁచకున్నది.

వి:—సంశయ మేమి? పాతివ్రత్యమూర్తివి తపస్వినివి, తగినప్రాయశ్చిత్తము విధింపుము.

ప:—(సవినయముగా) ఆర్యపుత్రా! ఆయధికారము కులగురువులకు మాత్రమే కలదు.

వి:—[జంకి] అయ్యో! ఆమహర్షి మొగము చూడఁగలనా?

ప:—[తల వంచి] గత్యంతరము కనఁబడదు. వంశాచార మతిక్రమింపరాదుగదా!

వి:—కానీ! మహారాజ్ఞివి. నీశాసన మనుల్లంఘనీయము.

ప:—ఆర్యపుత్రా! అట్లనరాదు, మహాత్ములధర్మశాసనమునకు లోకమంతయు కట్టుపడవలసినదే. మీరు లోకశాసకులుకదా!

వి:—సరే! కణ్వమహర్షిని సందర్శింతును.

ప:—[సంతోషముతో] మీహృదయపరివర్తనమున కానందించితిని. [చేతులు పట్టుకొని] నమస్కారము. నాదుఃఖాలాపము క్షమింపుఁడు.

[తెరవాలును]

వి శ్రు త్రో ర్వ శీ య ము

అష్టమ రంగము—హిమాలయమార్గము

—◆ పాదచారి యగువిశ్వామిత్రుండు ప్రవేశించును ◆—

— (మోమెత్తిచూచి) దేవీ! కులగురువియానతిని ప్రాయశ్చిత్తవిధికి పోవుచున్నాను. ఇది విన్నచో నీవు సంతాపింతువో సంతోషింతువో! అమృతకుండమున స్నానము చేయుచు దినమున కాలు వేలచొప్పున పన్నెండురోజులు గాయత్రీమంత్రము జపించుమని యాదేశించిరి. నాలుగుదినములు పర్ణభక్షణము నాలుగునాళ్లు నీరభక్షణము కడపటినాలుగువాసరములు వాయుభక్షణము విధించిరి. ఇందుకు విచారము లేదు గాని భూమిపై కాలినడకను పొమ్మని సెల విచ్చిరి గదా! నావియద్గమనశక్తి నెఱింగి విధించినశిక్షయిది-అబ్బా! ఎక్కడికణ్వాశ్రమము? ఎక్కడిహిమాలయగర్భము? శ్రీహరీ!! చేసినకర్మ మనుభవింపక తీరునా?—ఇంకా రెండామడ యున్న దట! (నడచుచు వింతగా ముందు చూచి) ఎక్కడిదీయపూర్వసుగంధము? హాయి హాయి! (ప్రక్కకు చూచి) ఆవచ్చువానివద్ద నేమేని సుగంధద్రవ్య మున్న దేమో (ఆఘ్రాణించి) ఏమి సువాసన? (అటు చూచి యాగి) ఆతడు చేరుచున్నకొలదిని సురభిగంధము హెచ్చుచున్నది— (తేఱి చూచి) ఆ! రానీ! అతనిమెడలోనిది పూలదండ కాదా! పుష్పహారమే. మగవాడు దీని కెందుకు? అది యూర్వశిమెడలో నుండ దగినది. (కొంచె మెదురేగి) దీని నెట్లయినా పుచ్చుకొని చుట్టుదారి యైనా సరే దాని కిచ్చి వచ్చెదను.

[పుష్పహారధారి యగుపురుషుఁడు ప్రవేశించును]

వి:— (సమీపించి) ఎవ రండీ మీరు?

పు:— గంధర్వులము?

వి:— మీ పేరు?

పు:— విశ్వావసువు.—మీ రెవరు?

వి:— క్షత్రియులము—ఈసురభికుసుమమాల యెక్కడిది?

పు:— నాకలోకమునుండి తెచ్చుకొన్నది.

వి:— అంతే యనుకొన్నాను—ఇవి మీ కచ్చట సులభములు (చిఱునవ్వుతో) దండ బాగున్న దండీ! మీరు నాకమునకు తఱచుగా పోవు చుందురుగదా!

పు:— ఆఁ! (నడచుచుండును)

వి:—చిన్నమాట

పు:—ఏమిటి చెప్పండి. (ఆఁగును)

వి:—ఈదండ నా కిత్తురా?... ... ...

పు:—(తీవ్రముగా) ఇవ్వ నివ్వను (పోఁబోవును)

వి:—కొంచె మాఁగండి— మనసుపడి కోరుచున్నాను—

పు:— నా మెడలోనిదండ యి మ్మందువు, అ దేమికోరి కయ్యా!

వి: —అయితే సరే! కోరిక కాదు, శాసనమే—

పు:—(కోపముతో) నన్ను శాసించుటకు నీ వెవఁడవు? వెళ్ళు వెళ్ళు (నడవఁబోవును)

వి:—ఆఁగు మని చెప్పలేదా? ఆఁగు—

పు:—(ఆఁగి తీవ్రముగా) ఏమి టీయాజ్ఞ? దార్లు కొట్టువాఁడవా?

వి: — జాగ్రత్తగా మాటాడు.

పు: —అరే! ఏమి టీబెదరింపు? చిత్రముగా నున్న దే!

వి:—ఇది రాజాజ్ఞ. ఇచ్చి కదలు. లేకున్న ... ...

పు:—[అపహాసముతో] బళీ! పాకము ముదురుచున్నదే! నీకత్తియక్కడ పెట్టుము. ఇది గంధర్వవీరాజ్ఞ!

వి:—[నవ్వుచు] సెబాసు గంధర్వా! మంచిమాటన్నావు. కత్తి లేని వానితో నేను ఖడ్గము పట్టి పోరాడను. నాకత్తి యీబండపై బెట్టెదను. నీదండకూడా అక్కడ పెట్టుము. ఈ రెండును గెలిచినవారివి. బాహుయుద్ధ మొనరింతము సరేనా?

పు:—ఓ! కానీ! ఆగర్వ మణగుట మంచిదే! [అట్లు చేసి, పెనుస్తులు తీసి యందుంచి కొంతసేపు బాహాబాహిగా పోరాడుదురు.

వి:—(చేతులుపట్టి ముందుకు లాగి, యొక్క గెంటు గెంటి) గర్వ మణగిన దోః? గంధర్వవీర!

పు:—(వెలికిలబడి లేచి, ఒళ్ళు దులుపుకొనుచు) ఎగురబోకుము చూడు నీపొగ రణంతు (అనుచు డాయును)

[తెర లో]

వద్దు వద్దు వెళ్ళకు కలియబడకు ఆగు.

వి:—(అటు చూచి) అయ్యో పాపము! ఆడది పరుగెత్తుకొని వచ్చుచున్నది.

పు:—(సిగ్గుతో తల వంచును)

ఆ: (ప్రవేశించి, ఏమి టిది? ఇంతలోనే... (గంధర్వుని కష్టముగా నిలచి వగర్చుచు రాజును జూచి) ఎవరు విక్రమమహారాజా! ఔరా! ఎంతప్రమాదము... ...?

వి:— భయములేదు. తత్తఱపడకు— నన్నెట్లెఱుగుదువు ?

ఆ: — (చిఱునవ్వుతో) పదునాలుగేండ్లక్రిందట యమునాతీరమున చూచినాను.

వి:— (ఆశ్చర్యపడి దరస్మితముగా) సరే సరే! తెలిసినది. ఇందురేఖా! నాడు కనబడకపోయినా, నేడు కనబడక తప్పినది కాదు. పూర్వస్నేహితురాలవు, సంతోషము_

ఇం:— నేఁడు సుదినము ధన్యురాలను.

వి:— రెండునూఱుసార్లు నీప్రసంగము వచ్చినది. నీమంచితనము నా మనస్సు నంటియున్నది.

ఇం:— ఇది మాయవ్యాజకరుణ కుదాహరణము.

పు:— (వినుచుతో) ఈయక్ష మేమిటి? ఆమాట లేమిటి?

ఇం:—ఏమి టాతొందర? పెద్దమనుష్యులతో మాటలాడుచుండఁగా...

పు:— అవు నవును. కానివా రెవరు? ఉండు. ఒ క్రిగిలు... ...

ఇం:— ఏ మనుకొన్నావో? హనుమంతునిముందఱనా కుప్పిగంతులు?

పు:— అయితే కానీ! బదులు తీర్చుచుండఁగా విడువను—

వి:— ఇందురేఖా! నీమొగము చూచి సంశయించుచున్నాను.

పు:— ఈయక్షమే లేకపోతే ఆ సంశయమే పుట్టకుండును (మీసము దువ్వును)

వి:— (చిఱునవ్వున నిరసనము చూపును)

ఇం:— అయినపరాభవము చాలదా? నీబడాయి యిక్కడ పనికిరాదు. ఈయనపరాక్రమము విన్నావా కన్నావా?

గీ. గాండ్రు గాండ్రు మటంచు వ్యాఘ్రం బొకండు
పైకి వచ్చుట గని తడఁబడక యితఁడు
చేర రానిచ్చి బలుతరవారి నేసె
నొక్క వేటున కది రెండుముక్క లయ్యె.

పు:— అబ్బో! గొప్పపరాక్రమమే.

ఇం:—[నవ్వుచు]కాదా! అదే నీవైతే, కామరూపముతో కాలికి బుద్ధి చెప్పియుందువు—తెలిసినదా! అసలీపోరాట మెందుకు తెచ్చిపెట్టినావు? ఆబుజముమీఁదిదుమ్ము దులుపుకో!...

పు:—[కోరచూపుతో]ఆయన తెచ్చిపెట్టినదే...

ం:—ఎందుకోసము?

పు:—ఆఁ! మరాళ. పూలమాలికకోసము.

ఇం:—అ దేదీ?

పు: అదిగో రాతిమీఁద...

ఇం:—తెచ్చి యిచ్చివేయుము...

పు:—[మొగము చిట్లించుకొని] నే నెందు కివ్వవలెను?

వి: —[చిఱునవ్వుతో] గెలిచినవారు తీసికొనడమే మాసమయము.

పు:—[కొంకొంఱ లాడుచుచూచి ఈయుద్ధము లేకపోతే గెలు పెవరిదో తెలిసివచ్చును. (తనదుస్తులు తీసికొని వెడలిపోవుచు) అది నీదే కదా! నీయిష్టము వచ్చినట్లు చేసుకో (నిష్క్రమించును)

ఇం: —(అటు చూచి) సురభిమాన మంతే యిదే! (పూలదండ తెచ్చి రాజుమెడలో వేసి నమస్కరించి) అతఁడు తెలియక చేసినయప రాధము క్షమించండి.

వి:—అతనిత ప్పేమీ లేదు — ఇది నాతప్పును గాదు—ఇంతకును నీ సౌశీల్యము మేలు చేసినది. ఇట్టియవ్యాజమైత్రి లోకములో దుర్లభము. ఇది మఱచిపోను.

ఇం—మహానుగ్రహము, ధన్యురాలను—అయితే మహారాజా! ఇపుడెక్కడి నుండి దయచేయుచున్నారు?

వి: —యదుపురమునుండి—

ఇం:—అల్లాగా? అంతఃపురము చిత్తగించి వచ్చుచున్నారా? పరమా నందము—ఈప్రియురా లింకా, అచ్చరకొండకు వచ్చి యుండు దనుకొని యీదారిపట్టినారా? పోనిండు. ఈవిధముగా పునర్దర్శ మైనది.

వి:— కాదు సఖీ! (దరహాసము) మఱియొకపనిమీఁద నిటు వచ్చు చున్నాను.

ఇం:—(అచ్చెరువడి) ఏమిటీ! మేరుగిరి కేమో, శ్రమపడ నక్కఱలే దని చెప్పవలె ననుకొనుచున్నాను—వింత లేమీ లేవు గదా?

వి:—(నవ్వుచు) ఉంటే నీకు తెలియవా?

ఇం:—అయితే, ఎక్కడి కీప్రయాణము?

వి:—అమృతకుండమునకు—

ఇం:—ఇం కేమి? దాఁపఱిక మెందు కండీ?

వి:—(చిఱునవ్వుతో) నీ వేవో పొరపడుచున్నావు —

ఇం: అయితే క్షమించండి. కారణ మేదేని కానిండు. అదృష్టవంతు లెక్కడికి వెళ్ళినా, అదృష్టవంతులే.

వి:—(సస్మితముగా) అ దేమిచెలీ! అట్లనుచున్నావు!

ఇం:—(దరహాసముతో) తీర్థము స్వార్థము కూడివచ్చిన దని—

వి:—(నవ్వి) నీవుకూడా నర్మసంభాషణము నేర్చినావా?

ఇం:—[హస్తము స్పృశించి] ఎంతమాత్ర మది కాదు. ఊర్వశి మేరుగిరినుండి వచ్చి యమృతకుండముచెంత విడిసియున్న దని చెప్పుట కట్లంటిని.

వి: [వికారముతోఁ బనీక] ఓ! అల్లాగా? మంచిదే—ఇం కేమైనా విశేషములు?

ఇం:—ఏ మున్నవి? మహారాజా! నే నింకఁ బోవలెను. అతఁడు త్వరపడుచుండును — ముఖ్యమైనమాట యొకటి — ఈపుష్పహారమష్టాబ్దసురభిమాల్యము దీనిమహిమ వినుఁడు.

క. యౌవనము నిల్పుఁ, బోయిన
యౌవనమును మఱల దెచ్చు, నతిదుర్లభ మీ
పూవులదండ, సుగంధం
బీవిధముగ నుండు నెనిమిదేఁడులదాఁకన్.

ఇఁక దీని నెట్లుపయోగించుకొందురో! మీచిత్తము.

(రాజుచేతులు కన్నుల కద్దుకొని) సెలవు సెలవు—(నిష్క్రమించును)

వి:— (పరిక్రమించుచు) ఔరా! నాజీవిత మెంత వింతగా నున్నది? తలఁచుకొన్న నాకే నవ్వు వచ్చుచున్నది. నేను పోవుచున్నపని

యేమి? ఈమాల్యావర్జన మేమి? ఊర్వశీస్మరణ మేమి? ఆహా! దైవమా! మరల నీయాట నీవు మొదలుపెట్టితివా! నిన్ను తప్పించుకొని తిరుగువాఁడు పృథివిలో నుండఁబోఁడు. నేను నీ చేతికీలుబొమ్మ నైనాను. (దుస్తులు తాల్చి కత్తి గైకొని నడచుచు) చారులవల్ల నాజాడ తెలుసుకొని యిది యిక్కడికి వచ్చియుండును. (ఆలోచించి) ఎట్లయినా చూడఁదలఁచినమాట నిజము. చుట్టుదారి తప్పినమాట సత్యము. అయితే ప్రాయశ్చిత్తవిధి మాట? (ఊహించి) దీనిమాట యటుండుఁ; ఇందుకు వచ్చినా నని తెలిసినచో నిది విధించుప్రాయశ్చిత్త మేమో! ఛీ! (సంకోచించి) ఎటు చూచినా చిక్కుగానే యున్నది. ముగ్గురు ముగ్గురే! దైవము చలపట్టి నన్ను పరీక్షించుచున్నది. ఆహా!

గీ. ఆడి తప్పితి వని వేశ్య యాడిపోయు,
నీతి మాలితి వని రాణి నిందసేయు,
ఆజ్ఞ మీఁటితి వని గురు వాగ్రహించు,
ఏల కనిపించెనో పాడు పూలదండ?

[ఆఁగి తలవంచి యాలోచించి, నిశ్వసించి] ఎందు కింక! ముందుకు పోతే ఇహమైనా యున్నది. వెనుకకు పోతే యిహాపరలు రెండును లేవు. (పరిక్రమించుచు నులికిపడి) ఇంతకు గడువు దాఁటలేదుగదా! (రోజులు లెక్కించి) ఆఁ! దాఁటలేదు. పోనీ! కీడులో మేలు. (రెండడుగులు వేసి యాఁగి శూన్యదృష్టితో తలంచి) అరే, పొరపాటు! ఈపూలదండ కనఁబడకపోయినా అమృతకుండముదగ్గఱ నూర్వశీదర్శనము సిద్ధమే—ఆహా దైవగతి! అటు గురువాక్యము, ఇటు వేశ్యాసమయము. ముందు నుయ్యి వెనుక గొయ్యి. కర్మ మెట్లున్నదో? నాబ్రదు కేమికానున్నదో కానీ!! గురువర్యా! నమస్కారము. [నిష్క్రమించును]

—o—

విశ్రుతోర్వశీయము

నవమ రంగము—అమృతకుండము చెంతరాతిమిద్దె

[వీథియరుగుమీఁదఁ గూర్చుండి మాట్లాడుకొనుచు
నూర్వశీవిశ్రుతులు ప్రవేశింతురు]

ఊః— మనోహరా! ఈపదిదినములనుండి యెన్నోవిధముల బ్రతిమాలుచున్నను నామాట వినకున్నారు. అది ధర్మముకాదు సుమండీ!

వి:— ప్రేయసీ! ఆగొడవ యింకఁ దేవద్దని కోరినా మరల నదే తెచ్చుట నీకును దగదు సుమీ!

ఊః— మాటకు మాటంటే సరా? ఇది యంత తేలికగొడవ కాదు.

వి:— కాకేమి? గోరంతలు కొండంతలు చేయుచున్నావు కాని...

ఊః— ఔను గాని, ఇందురేఖయభిప్రాయమునుబట్టి మీపట్టమహిషికివ్వవలసినపుష్పమాల నాకిచ్చుట తగునా?

వి:— అది నీకోసము సంపాదించితి నని చెప్పలేదా? మరెందుకీ ప్రశ్న? (లేచును)

ఊః— బాగున్నది. (లేచి) మీయనుగ్రహమున కానందించితిని. కాని నా కిట్టిదండలు లేవా? రావా? ఆమహాపతివ్రత కాదండను నా కానుకగా సమర్పింపుఁడు.

వి:— చిత్తము. ఆజ్ఞ నెఱవేర్పక తప్పునా?

ఊః— (నవ్వుచు) అంతయెకసక్కెమెందుకు?... సరే కాని, నిజము చెప్పండి మళ్ళీ అడుగుచున్నా ననుకోక. గడువులోపల రావలెనని నాకోసమే వచ్చినారా?

వి:— అబ్బా!!

ఊః— ముచ్చటగా నడుగుచుండ నంతవిసుగెందుకండీ?

వి:— నీకొఱకు రాకపోయినా నీకొఱకు వచ్చినట్లే యైనది. ఆమాట ముమ్మాఱులు చెప్పితిని. ఇంకా యెందు కాపరీక్ష?

ఊ:— ఎందుకో వినండి. త్రికరణశుద్ధిగా శ్రీహరిసాక్షిగా మనవి చేయుచున్నాను. మీ దేవిమాటలు మీకులదేవతమాటలు మీకులగురునియాజ్ఞ. పరమేశ్వరునియాజ్ఞ, ఆమాటలు తలఁచుకొంటే యొడలు వణఁకుచున్నవి! ఇప్పుడైనా నాకోరిక మన్నింపుఁడని చేతులు పట్టుకొని వేఁడుచున్నాను.

వి:— (విసిగించుకొని) ఎన్నాళ్ళీమాటలు? భయపడవలసినది నేనా నీవా? ఏమి టీనిర్బంధము? (పెడమొగము పెట్టును)

ఊ:— (దోసిలి యొగ్గి) రాజేంద్రా!

చ. వనితలమాట లన్న మగవారికిఁ జుల్కన గాక, రాజ్యవ
ర్తన దలపోయ కిట్లిహపరంబులకుం జెడు టర్హమా నె? నా
మనవి తిరస్కరింతురె? సనుస్త మెఱింగినమీకు నేను జె
ప్పనె? యిపుడైన నన్విడిచి పట్టపురాణిసుఖంబు చూడుఁడీ!

వి:— నీవు చిత్తశుద్ధిగాఁ జెప్పుచున్నావని నమ్మెదను గాని తెలిసినవాని కిన్నిసార్లు తెలుపవలెనా?

ఊ. నీవను పే రొనర్చి నని నేరము మోపకు, పాడుదైవ మే
పాపపువేళ నీకరము పట్టఁగఁ జేసెనో? నిన్నుఁ గన్ననా
చూపున కింక వేఱొక తెసొంపు రుచింపక యుండె, నామదిన్
దాఁపఱికంబు లే దిది యథార్థము, నాసుఖ మీవు చూడుమీ!

ఊ:— [చిరాకుతో] వద్దు వద్దు. మీయెడఁబాటున కోర్వఁ జాలక తలఁచి కదా తొలుత మీచే సమయము చేయించితిని! అట్టి నేనే యెందు కింత బలవంతపెట్టుచున్నానో కొంచె మాలోచించండి.

వి:—(సాక్షేపముగాఁ జూచి) కొంచెము కాదు చాలా ఆలోచించినాను. నానిశ్చయము చెప్పుచున్నాను విను.

ఉ. ఆనతి మీఱితినాఁడ నని యమ్ముని తీవ్రముగా శపించనీ!
మానము లేనివాఁడ నని మానిని ఛీ యని నింద సేయనీ!
పూని యొనర్చు కామువిధి పూర్తిగ దుర్గతిఁ గూలఁ ద్రోయనీ!
యే నిఁక నిన్ను వీడి పురి కేగఁగఁ జాలను దివ్యకామినీ!

స:—(మొగము చిట్లించుకొని పెడమొగము పెట్టి తనలో) ఇది కేవలము రూపమోహ మని యెఱుఁగుదును. ఈకనువేఁదు అణఁగి పోవుచికిత్సయే యిపుడు కర్తవ్యము. అది ముందు కొంతసూచించుట యెందు కైన మంచిది. [ప్రకాశముగా, కోపముతో] నీవు నారూపమును మోహించినట్లే నేను నీరూపమును మోహించితిని. నిజ మింతే కదా! అట్టియెడ నే నావాంఛ వదలుకొనుచుండ నీ వెందుకు వదలుకో లేవు? నీ కేడుగురు పుత్రులఁ గన్నప్రియురాల నింత నిర్బంధించి యెందుకుఁ జెప్పుచున్నానో వివేకించుకో! అగ్నిసాక్షిగాఁ బెండ్లాడినయామె సతీమణి ధర్మచింత యెట్టిదో స్మరించుకో! తనువులే శాశ్వతములు కావు. ఇకరూప యౌవనములు శాశ్వతములా? ఇప్పటికే నీయర్ధాంగిజవ్వన మడవిని గాచినవెన్నెల యైనది. ఆపాతకము నీతో సమానముగాఁ బంచుకొనుచున్నామనవి చిత్తగించి యిపుడైనా నీగురునియానతి నడపి పురంబునకుఁబొమ్ము.

[అని చెరచెర లోపలికిఁ బోవును]

:—(నిశ్చేష్టుఁడై చూచి) ఏమి టీఘోరము? నీవు నీ వనుచు నిశ్శంకముగా నిట్లు తూలనాడుట చూడ దీని మనసు విఱిగినట్లు స్పష్టమైనది. [నిశ్వసించి పరిక్రమించుచు] ఇది ప్రేమ లేనికోపమా? కాదు. వారు శపింతు రన్నభయము... [ఊహించి] నిజమే, రూపమోహమే. కాదేని, యేదోష మెఱుఁగనికన్యారత్న మని దీనిని వరించితినా? అది కన్ను చేసినతప్పు. మనస్సు నందురు

గాని కన్ను మూఁచెడ్డది. ఆరూపము మనస్సున కింత గాఢముగా నంటుటకుఁ గన్నే కదా కారణము! ఇపు డేమి చేయను! దీనికి నీతులు పని చేయునా? జపతపములు పనిచేయునా? ఇప్పుడు కన్నులు పోయినా నన్నీరూపమోహపిశాచము వదలదు... దీని నావహింపఁజేసినదైవమే దీనిని వదల్పవలెను. అంతవఱకే బ్రతు కింతే. లేకపోతే, పూలదండ కవఁబడినంతనే యిదే స్మృతికి రావలెనా?......[తలంచి] ఆహా!

ఉ. మానము మంటలోఁ గలసె మంత్రిమొగంబును జూచువేళ, నా
ప్రాణము పోయినంతపని యయ్యె సతీమణిఁ గాంచువేళ, దొంగైనను మేలు నాఁగ భయ మయ్యె మహర్షిని జేరువేళ, నన్నైనను వీడకుండె నవురా! కనువేదు, అి దెట్టిమోహమో!!

[తల యూడించుచు నాశ్చర్యవిషాదములు దోఁప]

క. పో పొమ్మని తెగనాడిన
నీపాపపురూపమోహ మెడఁబాయ, దిసీ!
భూపతి ననునభిమానము
కోపంబును గామచింతకుఁ బలి యయ్యెన్.

(ఇట్టటు పరిక్రమించి తల యూఁచి) కానీ! నేఁటితో నేదో యొకటేలు నని పొడగట్టుచున్నది, చూతము. (ద్వారమువంక చూచి) చాలసేపైనది లోపలికి వెళ్ళి... ...ఏమి చేయుచున్నదో? రుచిమతీ!

[తెరలో విసుగుతో] ఏమండీ?

వి:—ప్రేయసి యెక్కడ?

[తెరలో] మీ నైవేద్యము నడగండి.

—(తెల్లఁబోయి) ఇ దేమిటిరా! దీనిధోరణి కూడా మారినది? ఇ దేదో వింతగానే యున్నది. అవస్థ మాఱేరోజు వచ్చినది.

సందేహము లేదు, ...పోయి చూతునా ? (రెండడుగులు వేసి) అక్కడిగొడవ యేమిటో ! (ఆఁగి) రుచిమతీ ! ఏమిటి సంగతి ? నేను వత్తునా ?

[తెరలో] రా నక్కఱ లేదు. అక్కడుంటే వచ్చినంతసంతోషము

వి:—సరే తెలిసిపోయినది. ఇదేదో కుతంత్రమే. రూపయావనములను గూర్చి యుపన్యసించి వెళ్లినది ... ...ఏదో మోసము తలపెట్టినది. (స్మరించి) ఆఁ ! అచ్చరలకుఁ దెలియనిమాయ లున్నవా ? కామరూపకామగమనము లెఱిఁగినది మోసగించలేదా ? సరే కానీ, ఏమయినా మంచిదే... ...

[తెరలో] ఇదేమిటమ్మా! పిడుగు పట్టట్టు వచ్చి పడ్డది. అమ్మో! ఎల్లాగంటిరూప మెట్లు మాఱిపోయినది ? లేవడ మెందుకు ? సరేలే ! ఈకఱ్ఱ పట్టుకో ! (మూడుకాళ్ళముదుసలియగునూర్వశియు రుచిమతియు నొకవంక ప్రవేశింతురు)

వి:—(తీవ్ర దృష్టితో) ఈమూఁతముప్పుడి యేమిటి ? వెళ్ళి చూచెద. (పరిక్రమించి యాటుచూచి) అబ్బా ! ! (మొగము త్రిప్పుకొని ఏ మిటిది రుచిమతీ నిజము చెప్పు.

ఊ:— (పెదవులు దవుడలు నాడుచుండ శిరఃకంప మభినయించును)

రు:— ఏ మున్నది? కనఁబడడము లేదా?

వి:— మాట్లాడుచుండఁగానే ముసలితనము పైఁబడె నందువా?

రు:— నాటకములో వేషము వేసిన దండీ!

వి:— ఏమి టీవిసుగు? తిన్నగాఁ జెప్పలేవా?

రు:— మీాచెట్ట పట్టినందుకు ఫలమిది ...

ఊ:— (కొంచెము ముందుకు వంగి వణఁకుచు) మనోహరా!

వి:— (మొగము ముడుఁచుకొనును)

ఊ:— ఈవింతరూపము దైవమాయచే వచ్చినది. దైవము నేమందును? నాపాప మది. నీ వనుమానింతు వని విచారింపనా? నా

దురవస్థకు దుఃఖింపనా? హా దైవమా!

గీ. కాలకర్మవశంబునఁ గాన నైతి,
మానవుని గూడి ముదుసలిదాన నైతి,
రూపసంపద వలచి కురూప నైతి,
నచ్చరలలోన నగుఁబాట్ల కగ్గ మైతి.

ఆక్రూరదైవము మనకూటమి సహింపలేదు. నే నేమి చేతును?

గీ. నిర్జరాంగన నైనానెత్తి యెక్కి-
యాజరాదేవి తాండవం బాడఁజొచ్చె
పాపవశమున నెడఁబాటు దాఁపరించె
భూవరా! వందనంబింకఁ బోయి వత్తు.

(రుచిమతితో యవనికాన్తరితయై నిష్క్రమించును)

వి:— నిజముగా నూర్వశియే (తల దులుపుకొని) అబ్బా! పీడ వదలి పోయినది. చక్కని యెత్తు వేసినది మంచిమంత్రిక త్తె. చిటికలో నాపిశాచబాధ వదల్చినది. -మ త్రేనోకుతంత్రము పన్నుచున్నదనుకొన్నాను. ఎంతమాయలాడి? (నవ్వుకొని) పాపమఁట దైవమట!! దొంగవేషము. పతివ్రతాశిరోమణి పట్టను హిపి శపించు నని భయపడినది. నాగు ట్టెఱుఁగును గావున దాని కిదేమం దనుకొన్నది ... ఛీ! తలఁచుకొంటే శోకు వచ్చుచున్నది. [ఒళ్లు పులకింప] రోఁత రోఁత. అపు డారూపము నా మతి చెఱిచినది. ఇపు డీరూపము నామతి విఱిచినది. సెబాసు! ఏదయినా దైవమే చేయవలెను. ఇంక నిది నిజరూపముతోఁ గనఁబడినా యీరూపమే తలఁపునకు వచ్చునట్లు చేసినది ... నాకై తెచ్చుకొన్నవార్ధక మైనా కొంతసేపు దానిఫల మనుభవించినది. అంతే చాలు ... ఇది సదుద్దేశముతో నామేలును నారాణిమేలును గోరిన దైతే, ఇంతకు ముం దీవేష మెందుకు

వేయలేదు? ఇపుడా దేవిపాతివ్రత్యమహాత్త్వము విన్నది. ఈ కురూపము తెచ్చుకొన్నది. అంతే. లేకున్న వేశ్య యెక్కడ? పరార్థచింత యెక్కడ?... అయితే నేమిలే! నిర్జరాంగన నన్ను గర్వ మొక్కనిమిష మణఁగినా యణఁగడమే.

సీ. అలినీలవేణి నన్నన్నమాటలు విని
దీపించుకురులెల్ల తెల్లఁబోయె,
పర్వేందుముఖి నన్నుఁ బాయుట కని పెట్టి
మోము సంకోచించి మూతి ముడిచె,
ఇందీవరాక్షి నాపొందు వీడుట గాంచి
బెంగతోఁ గనుదోయి క్రుంగిపోయె,
కనకాంగి నామాట వినలే దటంచు వం
దురి యంగములు వంగి తిరుగకుండె,
గీ. అనఁగ వార్ధక మిమ్మాయలాడిరూపు
పో నణఁచి నాకుఁ దగినట్లు బుద్ధిచెప్పె.
[చేదోయి ఫాలమున ఘటించి]
దీనితో రూపమోహంబు తీరి పోయె
దైవమా! చాలు వారకాంతాసుఖంబు.

పరిక్రమించుచు] సర్వముదైవాధీనము. నన్ను దారితప్పించిన దైవ మే నేటికి మరల దారికి దెచ్చినది. (సంతోషముతో) ఇంకఁ బుస తుడ నగుటయే తరువాయి, (ఆఁగి) ఔను గాని, కులగురు లప్పటికిఁ జేసినపాపమునకుఁ బ్రాయశ్చిత్తము విధించిరి, మరలఁ జేసినపాపముమాట యేమి? ఈదోష మాపతివ్రతా శిరోమణి కనిపెట్టదా? ఆమహర్షికిఁ దెలియదా? [ఆలోచించి] దీనికై మరల నమృతకుండమునకు రానేల? గాయత్రీజపము రెట్టింపు గావింతును. అది తెలిసి వా రేమందురో! తరువాతఁ జూతము [మీఁదు చూచుచు దోసిలి యొగ్గి]

సీ. కణ్వమహర్షియాజ్ఞను మనంబున నెంచి
యమృతకుండస్నాన మాచరించి,
ఆహారనియమ మింతైనఁ దప్పక మహా
భక్తి గాయత్రీజపం బొనర్చి,
రాజధానికి నేగి రాణిపతివ్రత
కష్టాబ్దసురభిమాల్యం బొసంగి,
మరలఁ జేసినతప్పు మఱియుఁ జేసినజపం
బెఱిఁగించి యాదేవికృప గడించి,
గీ. సకలజనరంజనంబుగ సత్యధర్మ
పరుఁడనై యింక యమరాజ్యపాలనంబు
నాచరించెద నిందిరాప్రాణనాథ!
శ్రీహరీ! దేవదేవ! రక్షింపుమయ్యా!
(అని నమస్కరించి పరిక్రమించుచు)

భరతవాక్యము

గీ. ఖ్యాతవృత్తంబు మర్త్యదివ్యాంచితంబు
వీరకరుణాద్భుతాంగ శృంగారితంబు
రంగరమ్యంబు బుధజనరంజనంబు
విక్రమోర్వశీయము భువి వెలయుఁ గాక
[అని నిష్క్రమించును]

ఇది మల్లాది సూర్యనారాయణశాస్త్రి
ప్రణీతమైన విక్రమోర్వశీయమున
నవమరంగము.

—o—

శ్రీ చింతామణీ ప్రెస్, రాజమండ్రి.